teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 156 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 29 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## కాంగ్రెస్ రైతులను ఓటు బ్యాంకుగా చూస్తోంది: ప్రధాని మోదీ



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): హర్యానాలోని హిసార్‌లో బీజేపీ జన్ ఆశీర్వాద ర్యాలీలో బీజేపీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో సుస్థిరత ఉండదని, ఎన్నికల తర్వాత ఆ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేసి, వాటిని తుంగలో తొక్కుతుందని ఆయన అన్నారు. రిజర్వేషన్లను కాంగ్రెస్ అంతం చేసిందని ప్రధాని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓట్లు తప్ప మరేమీ కనిపించడం లేదని, అయితే బీజేపీ అణగారిన వారికి మద్దతిచ్చి వారి కలలకు రెక్కలు ఇస్తుందని అన్నారు. రైతుల

మిగతా 2 లో



## యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి

### సత్ఫలితాలనిచ్చిన వరుస సమీక్షలు, సమావేశాలు

### దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నిర్వహించిన వరుస సమీక్షలు, సమావేశాలు సత్ఫలితాల నిచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి సురేఖ చొరవతో దేవాలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులను ప్రారంభించేందుకు సీఎం రేవంత్ రెడ్డి అనుమతి ఇచ్చారు. దీంతో వెంటనే

మిగతా 2 లో




# కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్‌కు చెక్

### జంక్షన్లను సిగ్నల్ ఫ్రీగా మార్చేందుకు సర్కార్ నిర్ణయం

### ఆరు జంక్షన్లను హెచ్‌సీటీ ప్రాజెక్టులో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే

హైదరాబాద్ మహా నగరంలోని కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) పార్కు చుట్టూ ఉన్న జంక్షన్లలో ట్రాఫిక్ సమస్యలకు త్వరలో చెక్ పడనుంది. ఈ జంక్షన్లను సిగ్నల్ ఫ్రీగా మార్చేందుకు యూటర్న్‌లు కాకుండా.. అండర్‌పాసలు, ఫ్లైఓవర్ల నిర్మాణం ద్వారా సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.




హైదరాబాద్, సెప్టెంబరు 28 (తీన్మార్ న్యూస్): కేబీఆర్ పార్కు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు ఇకపై ఎలాంటి యూటర్న్‌లు లేకుండా రయ్యుమంటూ దూసుకెళ్లే విధంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించనుంది. ఈ మేరకు పార్కు చుట్టూ ఉన్న ఆరు జంక్షన్లను రూ.826కోట్లతో అభివృద్ధి చేయనుంది. ఇందుకు సంబంధించి నిధులను సీఎం మంజూరు

మిగతా 2 లో

## బిల్లును ఆమోదిస్తే ములుగుకి మున్సిపాలిటీ హోదా దక్కుతుంది

### చట్టానికి ఆమోదం తెలపాలని రాష్ట్రపతికి మంత్రి సీతక్క వినతి



సికింద్రాబాద్, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్యేగా తాను ప్రాతినిధ్యం వహించే ములుగు గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చే చట్టానికి ఆమోదం తెలపాలని భారత రాష్ట్రపతికి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క విన్నవించారు. శనివారం రాష్ట్రంలో ముర్ము పర్యటన

మిగతా 2 లో



## ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై అధికారులతో సీఎం సమీక్షా

### మహిళే యజమానిగా డిజిటల్ కార్డు ఇచ్చుటకు నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై సంబంధిత అధికారులతో సచివాలయం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళే ఇంటి యజమానిగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఒకే కార్డులోకి రేషన్, హెల్త్, ఇతర పథకాలు వర్తింపజేస్తామని అన్నారు. అందుబాటులో

మిగతా 2 లో

## హైడ్రా కమిషనర్ పై హెచ్ఆర్సీలో కేసు నమోదు

### బుచ్చమ్మ ఆత్మహత్యపై స్పందించిన రంగనాథ్




హైదరాబాద్, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ కమిషనర్ ఏవీ రంగనాథ్ పై కేసు నమోదైంది. ఈ మే-రకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ లో కేసు నమోదైంది. హైడ్రాకు చెందిన

మిగతా 2 లో



## ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత హైడ్రాకు ఉంది

### కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం

### సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయొద్దని సూచనలు

.. వివరాలు 2లో



## ఐపీఎల్ మెగా వేలానికి ముందే ఆటగాళ్ళకు శుభవార్త

### క్రికెటర్లకు మరింత ఆర్థిక లబ్ది చేకూర్చేలా మరో కీలక నిర్ణయం

### మెగా టోర్నీలో ఆడే క్రికెటర్లకు మ్యాచ్ ఫీజులు ప్రకటన

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): ఇండియన్ ప్రీమియర్ లీగ్ మెగా వేలానికి ముందే ఓ శుభవార్త. ఈ లీగ్‌లో ఆడుతున్న, ఆడాలనుకుంటున్న క్రికెటర్లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి తీపి కబురు చెప్పింది. క్రికెటర్లకు మరింత ఆర్థిక లబ్ది చేకూర్చేలా మరో కీలక

మిగతా 2 లో




## జవహర్‌నగర్‌యార్డుపై లోడు తగ్గించేందుకు కసరత్తు

### మేడ్చల్, యాదాద్రి, రంగారెడ్డి, సంగారెడ్డిలో స్థలాలు

### ప్రభుత్వం ఓకే చెబితే వెంటనే ప్లాంట్లు ఏర్పాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): జవహర్ నగర్ డంపింగ్ యార్డుపై భారం తగ్గించేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తోంది. సిటీని ఆనుకుని ఉన్న మేడ్చల్, యాదాద్రి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని స్థలాలను గుర్తిస్తోంది. ఇప్పటివరకు రంగారెడ్డి

మిగతా 2 లో

## వెంకటేశ్వర్లు జవాబులపై కాళేశ్వరం కమిషన్ ఆగ్రహం

### మేడిగడ్డ సీకెంట్ ఫైల్స్ మీద ప్రశ్నల వర్షం



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ శనివారం ఆ ప్రాజెక్టులో కీలక పాత్ర పోషించిన మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) నల్లా వెంకటేశ్వర్లుతో బాటు పలువురు అధికారులను విచారించింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు చెప్పిన జవాబులపై కమిషన్ చీఫ్ పీసీ ఘోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ ముందు అవాస్తవాలు చెబితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. శనివారం ఉదయం మాజీ

మిగతా 2 లో

## దసరా నవరాత్రి ఉత్సవాల్లో డీజే నిషేధం

### శబ్ధ కాలుష్యాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి: సీవీ ఆనంద్

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నగరంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో డీజే సంగీతాన్ని పోలీసులు నిషేధించారు. గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగల తర్వాత హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ నిర్వహించిన సమావేశంలో డీజేను నియంత్రించాలని నిర్ణయించారు. అక్టోబరు 3 నుంచి 12వతేదీ వరకు జరగనున్న నవరాత్రి



మిగతా 2 లో



## నిరసనల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు వెనక్కి

### డబుల్ బెడ్‌రూం ఇళ్లకు 85 కుటుంబాల తరలింపు

### ఎట్టి పరిస్థితుల్లో కఠినంగా వ్యవహరించొద్దు: సర్కార్

### ఆందోళనల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు వెనక్కు

.. వివరాలు 2లో

## బిల్లును ఆమోదిస్తే ములుగుకి మున్సిపాలిటీ హెూదా దక్కుతుంది

మొదటి పేజీ తరువాయి

సందర్భంగా సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ముర్ముతో ఆమె ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్రపతి కార్యాలయం లో ములుగు మున్సిపాలిటీ బిల్లు పెండింగ్ లో ఉందని సీతక్క, రాష్ట్రపతికి గుర్తు చేసినట్టు తెలిపారు. బిల్లును ఆమోదిస్తే ములుగుకి మున్సిపాలిటీ హెూదా దక్కుతుందని వివరించారు. త్వరలో బిల్లు క్లియర్ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ చేరుకున్నప్పటి నుంచి, ఢిల్లీకి తిరుగు ప్రయాణం అయ్యేంత వరకు రాష్ట్రపతి పర్యటన ఆద్యంతం



మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హెూదాలో మంత్రి సీతక్క రాష్ట్రపతి వెంటే ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహెూత్సవ కార్యక్రమన్ని రాష్ట్రపతి ప్రారంభించగా అదే వేదిక నుంచి మంత్రి సీతక్క ప్రసంగించారు. ఈశాన్య రాష్ట్రాల సాంప్రదాయ నృత్యాలతో కళా మహెూత్సవ కార్యక్రమం కొనసాగటం పట్ల సీతక్క హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆదివాసి బిడ్డగా ఆదివాసీ గిరిజనుల నృత్యాలు తాను ఎంతగానో ఆస్వాదించానని చెప్పారు. ఎవరు ఏ స్థాయికి ఎదిగినా తమ మూలాలను మరిచిపోవద్దని కోరారు. సంస్కృతి సాంప్రదాయాల వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. దేశంలో ఎన్నో కులాలు, ప్రాంతాలు, జాతులు ఉన్నప్పటికీ భిన్నత్వంలో ఏకత్వమే భారత దేశానికి అసలైన బలమని చెప్పారు. హైదరాబాద్ పర్యటన ముగించుకుని ఢిల్లీ బయలుదేరిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారికి బేగంపేట విమానాశ్రయంలో తెలంగాణ పల్లె సంస్కృతి ఉట్టిపడే పెయింటింగ్ ను రాష్ట్రపతికి మంత్రి సీతక్క బహుకరించారు. కాగా, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సహచర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హార్కర వేణుగోపాల్ కూడా రాష్ట్రపతికి విడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

## యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

పనులు ప్రారంభించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బంగారు తాపడం పనుల బాధ్యతను స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించింది. ఈ పనులను బ్రహ్మోత్సవాల నాటికి ముందే 2025 మార్చిలోపే పూర్తి చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. ఈ పనులను నిరంతరం పర్యవేక్షించేందుకుగాను దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ చైర్ పర్సన్‌గా, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ డైరక్టర్ కన్వీనర్‌గా, ప్రభుత్వ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ సలహాదారు, వైటీడీఏ వైస్ ఛైర్మన్ జీ.కిషన్ రావు, యాదగిరి గుట్ట దేవస్థాన కార్యనిర్వహణాధికారి, విద్యుత్ శాఖ చీఫ్ ఇంజినీర్ సభ్యులుగా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ బంగారు తాపడం పనులను పర్యవేక్షిస్తూ సూచనలు, సలహాలివ్వనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం బంగారు తాపడం పనులు, ఈ పనుల పర్యవేక్షణకు సంబంధించి ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు సంబంధించి రెండు వేర్వేరు జీవోలను జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రాములవారి దేవాలయ అభివృద్ధి, విస్తరణ పనుల నిమిత్తం భూసేకరణకు అనుమతులను మంజూరు చేస్తూ ప్రభుత్వం మరో జీవోను జారీ చేసింది.

## ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై అధికారులతో సీఎం సమీక్షా

మొదటి పేజీ తరువాయి

ఉన్న డేటా ఆధారంగా అర్హుల నిర్ధారణ చేస్తామని వెల్లడించారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి పైలట్ ప్రాజెక్టుగా పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, అర్హులైనవారందరికీ ప్రభుత్వం తరపున సంక్షేమ పథకాల ఫలాలు అందించాలని ప్రభుత్వం భావిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ విధానాన్ని అవలంభిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్డు ద్వారానే లబ్ధిదారులు ఎక్కడినుంచైనా రేషను వస్తువులను తీసుకోవచ్చుని, ఏ ఆస్పత్రిలోనైనా చికిత్స పొందవచ్చుని, ఆ దిశగా ఉపయోగపడేలా ఈ కార్డులు ఉంటాయని స్పష్టం చేశారు. వైద్యారోగ్య అవసరాలకు చికిత్స పొందే సమయానికి సదరు వ్యక్తికి సంబంధించి హెల్త్ ప్రొఫైల్ మొత్తం ఈ డిజిటల్ కార్డు ద్వారా డాక్టర్లు తెలుసుకునే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. ఈ డిజిటల్ కార్డులో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవచ్చని వెల్లడించారు.

## ఐపీఎల్ మెగా వేలానికి ముందే ఆటగాళ్ళకు శుభవార్త

మొదటి పేజీ తరువాయి

నిర్ణయం తీసుకుంది. ఐపీల్ చరిత్రలో కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ ఆ మెగా టోర్నీలో ఆడే క్రికెటర్లకు మ్యాచ్ ఫీజులు ప్రకటించింది. ఐపీఎల్ ఆడే క్రికెటర్లకు సైతం మ్యాచ్ ఫీజు చెల్లించాలని బీసీసీఐ నిర్ణయం తీసుకుందని సెక్రటరీ జై షా వెల్లడించాడు. రాబోయే సీజన్ నుంచి ఐపీఎల్‌లో ప్రతి మ్యాచ్‌కు ఆటగాళ్లు రూ.7.5 లక్షలు ఫీజుగా అందుకుంటారని, తద్వారా ఒక ఎడిషన్‌లో ఒక్కో క్రికెటర్ రూ.1.05 కోట్లు ఆర్జిస్తారని షా వివరించాడు. ఐపీఎల్‌లో అన్ని లీగ్ మ్యాచ్‌లు ఆడే క్రికెటర్‌కు ఒక ఎడిషన్‌లో రూ. 1.05 కోట్ల ఆదాయం సమకూరనుంది.

## కాంగ్రెస్ రైతులను ఓటు బ్యాంకుగా చూస్తోంది: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

సమస్యలను బీజేపీ పరిష్కరిస్తోందని, కాంగ్రెస్ మాత్రం రైతులను ఓటు బ్యాంకుగా చూస్తోందని ప్రధాని పేర్కొన్నారు. పంటలకు కనీస మద్దతు ధరపై కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం 24 పంటలను కనీస మద్దతు ధరకు సేకరిస్తున్నదని ఆరోపించారు. 2016లో ఉరీలో ఉగ్రవాదుల దాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి టెర్రర్ లాంచ్ ప్యాడ్‌లపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. సర్జికల్ స్ట్రైక్‌కు రుజువు అడగడం ద్వారా భారత రక్షణ దళాల విశ్వసనీయతపై కాంగ్రెస్ ప్రశ్నలను లేవనెత్తిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఓటమి భయంతోనే ఇండియా కూటమి చేతులు కలపలేదని బీజేపీ నేత, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ అన్నారు. ముఖ్యమంత్రి పేరును ఇప్పటికే బిజెపి నిర్ణయించగా, కాంగ్రెస్ ఇంకా తన ముఖ్యమంత్రి పేరును చెప్పలేకపోయింది.

## దసరా నవరాత్రి ఉత్సవాల్లో డీజే నిషేధం

మొదటి పేజీ తరువాయి

దసరా ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ను సరఫరా చేయవద్దని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. మిలాద్ - ఉన్ - నబీ పండుగ సందర్భంగా డీజే కోసం ఏర్పాటు చేసిన జనరేటర్‌లో మంటలు చెలరేగడంతో వారు పోలీసులు డీజే నిషేధ నిర్ణయాన్ని వేగవంతం చేశారు. డీజే సౌండుతో వెలువడే శబ్ద కాలుష్యంతో తాము అసౌకర్యానికి గురవుతున్నామని సాధారణ ప్రజల నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయి. ఊరేగింపుల్లో డీజే సౌండు పోలీసులకు వాకీటాకీల్లో వచ్చే సూచనలు కూడా వినలేక పోతున్నామని నగరానికి చెందిన ఓ పోలీసు అధికారి చెప్పారు. రాత్రి 10గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ మ్యూజిక్ ను అనుమతించరాదని తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దసరా ఉత్సవాల సందర్భంగా దాండియా సమావేశాల్లో డీజేలు పెట్టరాదని గోషామహల్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ కె వెంకట్ రెడ్డి సౌండ్ సిస్టమ్ ప్రొవైడర్లను ఆదేశించారు. శబ్ద కాలుష్యం చాలా బాధాకరం, ఆందోళన కలిగించే విషయమని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పారు. కాలనీల్లో డీజే మోగుతోందని, దీన్ని ఆపించాలని కోరుతూ ప్రజల నుంచి తమకు మెసేజులు, ఫోన్ కాల్స్ వస్తున్నాయని చెప్పారు. అమ్మకు ఆపరేషన్ అయింది ఈ సౌండుకు మరణిస్తుందేమోనని మరో వ్యక్తి ఆందోళన వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందరూ కలిసి శబ్ద కాలుష్యాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సీవీ ఆనంద్ కోరారు. ఇతరులకు అసౌకర్యం కలిగించే పనులు చేయరాదని, శబ్దకాలుష్యంపై డయల్ 100కు వచ్చే ఫిర్యాదులు పెరిగాయని,డీజేల వల్ల విద్యార్థులు చదువుకోలేక పోతున్నారని సీపీ చెప్పారు. డీజే సౌండులపై పలు ఫిర్యాదులు వచ్చాయి.డీజేల వల్ల ఫోన్లు, వైర్ లెస్ సెట్లు వినిపించవని, శబ్ద కాలుష్యం వల్ల బ్రెయిన్ హెమరైజ్‌తో ఓ వ్యక్తి మరణించారని సీపీ చెప్పారు. శబ్ద కాలుష్యం, బాణసంచా కాల్చడాన్ని నివారించాలని సీపీ సీవీ ఆనంద్ సూచించారు. సిటీ పోలీసు యాక్ట్ ప్రకారం శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు చట్టాలున్నాయని సీపీ చెప్పారు. బాణసంచా కాల్చడం వల్ల పలు ప్రమాదాలు వాటిల్లుతున్నాయని సీపీ వివరించారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్‌కు చెక్

మొదటి పేజీ తరువాయి

చేశారు. పాలనాపరమైన అనుమతులు ఇచ్చారు. ఆరు జంక్షన్లను హెచ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడంతోపాటు డిజైన్లను సైతం రూపొందించారు. త్వరలోనే జంక్షన్ల అభివృద్ధి పనులను పట్టాలెక్కించనున్నారు. ఆరు జంక్షన్లను 2దశల్లో చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ మహా నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటికే అనేక జంక్షన్లను సిగ్నల్ ఫ్రీగా మార్చా రు. అయితే కేబీఆర్ పార్కును సిగ్నల్ ఫ్రీగా మార్చడం ఎంతో సవాళ్లతో కూడుకున్నదిగా మారిం ది. ఇందుకోసం గత ప్రభుత్వంలో కొన్ని డిజైన్లు రూపొందించగా.. అవి కేబీఆర్ పార్కును ధ్వంసం చేసేవిధంగా ఉన్నాయంటూ పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను కూడా ఆశ్రయించారు. ఈ పరిస్థితుల్లో కేబీఆర్ పార్కుకు ఇబ్బంది కలగకుండా ప్రస్తుతమున్న రోడ్లలోనే ఫ్లైఓవర్లు, అండర్‌పాసలు నిర్మించేలా డిజైన్లు రూపొందించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఎక్కడా సిగ్నల్ ఉండకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా డిజైన్ చేశారు. ప్రస్తుతమున్న ఆరు జంక్షన్లలో కుడివైపు మార్గంలో(సవ్య దిశలో) అండర్‌పాసలను నిర్మించనున్నారు. ఎడమ వైపు మార్గంలో (అపసవ్య దిశలో) ఫ్లైఓవర్లను నిర్మించనున్నారు. వర్షాకాలంలో అండర్‌పాసలలోకి వర్షపునీరు వచ్చినా.. అవి లేకుండా చేసేలా నిర్మాణాల డిజైన్లను రూపొందించారు.

రూ.421 కోట్లతో ప్యాకేజీ-1లో

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు జంక్షన్ 1. రోడ్డు నెం.45 నుంచి కేబీఆర్ పార్కు యూసఫ్‌గూడ వైపు వై ఆకారంలో అండర్‌పాస్
2. కేబీఆర్ పార్కు ప్రవేశం నుంచి రోడ్డు నెం.36 వరకు నాలుగు లైన్ల ఫ్లైఓవర్
3. యూసఫ్‌గూడ వైపు నుంచి రోడ్డు నెం.45 జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్

కేబీఆర్ ఎంట్రెన్స్ ముగ్ధ జంక్షన్
1. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వరకు 2 లేన్ల అండర్‌పాస్
2. పంజాగుట్ట వైపు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు మూడు లేన్ల ఫ్లైఓవర్
3. కేబీఆర్ ఎంట్రెన్స్ జంక్షన్ నుంచి పంజాగుట్ట వైపు మూడు లేన్ల అండర్ పాస్


రూ.40 5కోట్లతో ప్యాకేజీ-2లో


రోడ్ నెం.45 జంక్షన్
1. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు వరకు అండర్ పాస్
2. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి రోడ్ నెంబర్-45 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్

ఫిలింనగర్ జంక్షన్
1. అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్ నెం.45 జంక్షన్ వరకు 2 లైన్ల అండర్‌పాస్
2. ఫిలింనగర్ జంక్షన్ నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్

మహారాజా అగ్రసేన్ జంక్షన్
1. క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ నుంచి ఫిలింనగర్ జంక్షన్ వరకు అండర్ పాస్
2. ఫిలింనగర్ జంక్షన్ నుంచి రోడ్ నెంబర్-12 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్

క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్
1. కేబీఆర్ పార్కు నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల అండర్ పాస్
2. అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్డు నెంబర్-10 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్







## నిరసనల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు వెనక్కి

హైదరాబాద్, సెప్టెంబరు 28 (తీన్మార్ న్యూస్): ఏళ్ల తరబడి ఉంటున్న తమను ఒక్కసారిగా వెళ్లమనడంపై స్థానికులు నిలదీస్తుండడం, వాగ్వాదాలు, ఘర్షణలకు దిగుతుండడంతో మూసీ నదీ గర్భం (రివర్ బెడ్)లో రెవెన్యూ అధికారులు మార్కింగ్‌ను తాత్కాలికంగా నిలిపి వేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నారు. మరోవైపు శనివారం నిర్వాసితులతో చర్చలు జరిపారు. మూసీ పక్కన ఇబ్బందులు పడే కంటే.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ప్ర శాంతంగా ఉండాలని సూచించారు. డబుల్ బెడ్ రూం ఇంటి విలువ రూ.30 లక్షలకు పైగానే ఉంటుందని చెబుతున్నారు. వీటి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తామని, ఇందుకోసం క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లను పంపిస్తున్నారు. సానుకూలత వ్యక్తం చేసినవారిని వెంటనే తరలించారు. కాగా, హై దరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి హిమాయత్‌నగర్ మండలం వినాయక వీధి (రసూల్‌పూర), శంకర్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడారు. 151 కుటుంబాలను పిల్లి గుడిసెలు, జియాగూడకు తరలిస్తామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల మేర మూసీ పరివాహకం ఉంది. నదీ గర్భంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో 12,184 అక్రమ కట్టడాలున్నట్లు గుర్తించారు. హైదరాబాద్ జిల్లాలో 1,595, మేడ్చల్‌లో 239, రంగారెడ్డిలో 332 నిర్మాణాలు నదీ గర్భంలో ఉన్నట్లు తేల్చారు. రెవెన్యూ అధికారులు గురు, శుక్రవారాల్లో హైదరాబాద్‌లో 1,485 నిర్మాణాలకు మార్కింగ్ చేశారు. జియాగూడ, నాంపల్లిలో 110 నివాసాలకు మార్కింగ్ చేయాల్సి ఉంది. నిర్వాసితులను మలక్‌పేట్ నియోజకవర్గం పిల్లి గుడిసెలు, జియాగూడ, జంగంమెట్, ప్రతాపసింగారం, కొల్లూరు, ముషీరాబాద్ సాయిచరణ్ కాలనీ, జూబ్లీహిల్స్ కమలానగర్‌లోని



డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తరలించాలని నిర్ణయించారు. 85 కుటుంబాలను పిల్లి గుడిసెలు, జియాగూడకు తీసుకెళ్లారు. అధికారులు లాటరీ వేసి ఇళ్లు కేటాయిస్తున్నారు. అక్కడికక్కడే ఇంటి ధ్రువపత్రంతో పాటు తాళం అందజేస్తున్నారు. కాగా, వినాయక్‌నగర్, శంకర్‌నగర్ ప్రాంతాల్లో సోమవారంలోగా ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పూర్తిగా ఖాళీ చేసిన చోట.. కూల్చివేతలు చేపట్టే అవకాశాలున్నాయి. మూసీ అభివృద్ధి ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు నదీ గర్భం, బఫర్ జోన్‌లో ఉన్న ఇళ్లు, గోదాంలు, షెడ్లను తొలగించడమే కీలకం. దాదాపు 15 వేల కుటుంబాలను ఇళ్లు ఖాళీ చేసేలా బుజ్జగించి ఒప్పించాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ కఠినంగా వ్యవహరించొద్దని అధికారులు, పోలీసులకు ఉన్నత స్థాయిలో ఆదేశాలు అందాయి. నిర్వాసితులు దూషించినా లోనైనా ఆగ్రహావేశాలకు గురికావొద్దని చెప్పినట్లు తెలిసింది. కాగా, హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో అక్రమ నిర్మాణాల్లో 300కు పైగా భారీవని తేల్చారు. నదీ సరిహద్దు నుంచి రెండువైపులా 50 మీటర్లు వరకు ఉన్న నిర్మాణాలను బఫర్ జోన్ కింద గుర్తించారు.

## ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత హైడ్రాకు ఉంది

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత హైడ్రాకు ఉందని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. హైడ్రా అంటే భరోసా, బాధ్యత దీనిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయొద్దని ఆయన సూచించారు. మూసీ, హైడ్రాపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఏవీ రంగనాథ్ మాట్లాడారు. కొన్ని కట్టడాలను కూల్చితే హైడ్రా బాగా పని చేస్తుందని కితాబిచ్చారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకే సీఎం హైడ్రాను తీసుకొచ్చారు. విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ హైడ్రా బాధ్యత. ఎన్ కన్వెన్షన్‌ను కూల్చేశాం దాని పక్కన ఉన్న గుడిసెలను కూల్చలేదు. ప్రజలు నివసిస్తున్న భవనాలను అసలు కూల్చలేదు. ఇటీవల కూకట్‌పల్లి నల్ల చెరువులో ఆక్రమణలను కూల్చేశాం. ముందస్తు సమాచారం ఇచ్చినా కొందరు ఖాళీ చేయలేదు. అక్రమ కట్టడాలను మాత్రమే కూల్చివేశాం అని రంగనాథ్ పేర్కొన్నారు. అమీన్‌పూర్‌లో ప్రభుత్వం భూములు పెద్ద ఎత్తున అన్యాక్రాంతం అయ్యాయి. అమీన్‌పూర్‌లో గతంలో ఓ హాస్పిటల్‌ను కూల్చినా మళ్లీ నిర్మించారు. అమీన్‌పూర్‌లో హాస్పిటల్‌ను కూల్చేశారని ప్రచారం చేస్తున్నారు. అమీన్‌పూర్‌లో కూల్చిన ఆస్పత్రిలో రోగులెవరూ లేరు. వీడియో రికార్డు కూడా చేశాం అని పేర్కొన్నారు. హైడ్రా మీద భయంతో బుచ్చమ్మ అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసి చాలా బాధపడ్డాను. బుచ్చమ్మను కొందరు భయపెట్టారు. హైడ్రా అంటే భరోసా, బాధ్యత దీనిని బూచిగా చూపించొద్దు. సరైన సమయం ఇచ్చిన తర్వాతే ఆక్రమణలు కూల్చివేస్తున్నాం. ఇప్పుడు కాకపోతే, ఇంకెప్పుడు చెరువులు, నాళాలను కాపాడుకోలేం అని రంగనాథ్ తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం అనేది రాజ్యాంగంలో భాగం. పరిశుభ్రమైన వాతావర ణం జీవించే హక్కులో భాగం. ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని రాజ్యాంగంలో పేర్కొన్నారు. పేదలకు ఇబ్బంది చేయాలనేది హైడ్రా అభిమతం కాదు. అసదుద్దీన్ ఓవైసీ, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన కాలేజీలపై ఫిర్యాదులు వచ్చాయి. విద్యా సంవత్సరం నష్టపోతుందనే వాటిపై చర్యలు తీసుకోలేదు. అక్రమ కట్టడాలపై వెనుక పెద్దవాళ్లు ఉన్నారని రంగనాథ్ పేర్కొన్నారు.

## జవహర్‌నగర్‌యార్డుపై లోడు తగ్గించేందుకు కసరత్తు

మొదటి పేజీ తరువాయి

జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో 42.22 ఎకరాలను, సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరువు మండలం లక్డారం గ్రామంలో 100 ఎకరాలు, మేడ్చల్‌జిల్లాలోని దుండిగల్‌లో 85 ఎకరాలు, చౌటుప్పల్ మండలం మల్కాపూర్ వద్ద 200 ఎకరాలను గుర్తించింది. ప్రతిపాదిత స్థలాల్లో చెత్త ప్రాసెసింగ్‌యూనిట్ల ఏర్పాటుకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కమిషనర్ ఆమ్రపాలి ఆయా జిల్లాల కలెక్టర్లను కోరారు.

ప్యారా నగర్ లో నయా టెక్నాలజీతో

సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లోని 152 ఎకరాల స్థలంలో వినూత్నంగా, యూరోపియన్ టెక్నాలజీతో చెత్త శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకుంది. ఇక్కడ 15 మెగా వాట్ల కెపాసిటీతో వేస్ట్ -టు -ఎనర్జీ ప్లాంట్‌ను, 270 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇవి ఏర్పాటైతే పూర్తిగా మూసి ఉండే ట్రక్కుల ద్వారా వ్యర్థాలను తరలిస్తారు. అండర్ గ్రౌండ్ బంకర్ లో వేసి తడి, పొడిగా వేరు చేస్తారు. అనంతరం పొడి వ్యర్థాల నుంచి విద్యుత్తు, తడి వ్యర్థాల నుంచి సీబీజీ గ్యాస్ ను తయారు చేస్తారు. డ్రై డైజెసన్ టెక్నాలజీ ద్వారా తడిచెత్త నుంచి బయోగ్యాస్ తయారు చెయ్యడం వల్ల లీచెట్ సమస్య కూడా ఉండదు.

## హైడ్రా కమిషనర్ పై హెచ్‌ఆర్సీలో కేసు నమోదు

మొదటి పేజీ తరువాయి

అధికారులు తమ ఇల్లు సైతం కూల్చేస్తామని భయభ్రాంతులకు గురి చెయ్యడంతోనే వృద్ధురాలు బుచ్చమ్మ బలవన్మరణానికి పాల్పడినట్లు పెద్ద ఎత్తున సమాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులు హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు చేశారు.

**మానవ హక్కుల సంఘం పిలుపు**

ఈ నేపథ్యంలోనే 16063/IN/2024 కింద కమీషనర్ ఏవీ రంగనాథ్ పై కేసు నమోదు అయ్యింది. త్వరలోనే ఈ కేసును విచారించనున్నట్లు మానవ హక్కుల కమిషన్ స్పష్టం చేసింది. ఇప్పటికే బుచ్చమ్మ ఆత్మహత్యపై రంగనాథ్ సైతం స్పందించారు.

**అందువల్లే బుచ్చమ్మ ఆత్మహత్య..?**

హైడ్రా ఎవరికి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని శనివారం ఆయన మీడియా ముఖంగా వివరించారు. బుచ్చమ్మ తన కూతుళ్లకు ఇచ్చిన 3 ఇళ్లు ఎఫ్‌టీఎల్ పరిధికి దూరంగా ఉన్నాయన్నారు. అయితే కూల్చివేతల్లో భాగంగానే తమ ఇళ్లను కూడా ఎక్కడ కూలుస్తారనే భయంతోనే వారి కూతుర్లు బుచ్చమ్మను ప్రశ్నించారు. కూతుర్ల మాటలకు నొచ్చుకున్న బుచ్చమ్మ ఆత్మహత్యకు ఒడిగట్టింది.

**హైడ్రాకు సంబంధం లేదు**

రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఘటన పెద్ద ఎత్తున ప్రచారం కావడంతో రంగనాథ్ వివరణ ఇచ్చారు. ఈ ఇష్యూకు హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. హైడ్రా గురించి వార్తల్లో గానీ, ఇతర సామాజిక మాధ్యమాల్లోగానీ భయాలు పుట్టించొద్దని ఆయన కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎలాంటి కూల్చివేతలనైనా హైడ్రాకు ఆపాదిస్తున్నారన్నారు. హైడ్రా అంటే ఒక భరోసా అని, కూల్చివేతల గురించి అనవసర భయాలు అవసరం లేదని రంగనాథ్ ధైర్యం చెప్పారు.

## వెంకటేశ్వర్లు జవాబులపై కాళేశ్వరం కమిషన్ ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

ఇంజనీర్ ఇన్ చీఫ్ నల్లా వెంకటేశ్వర్లు విచారణకు రాగానే కమిషన్ చీఫ్ మేడిగడ్డ సీకెంట్ ఫైల్స్ మీద ప్రశ్నలు ఆరంభించారు. ఈ క్రమంలో కొన్ని ప్రశ్నల తర్వాత 'ప్రత్యేకంగా మేడిగడ్డ బ్యారేజీకి సీకెంట్ ఫైల్స్ వాడమని మీకు ఎవరు సూచించారు అని ప్రశ్నించారు. నాటి సీడీవో సీఈ సూచనల మేరకే తాము వాటిని వాడామని వెంకటేశ్వర్లు బదులిచ్చారు. దీంతో పీసీ ఘోష్ ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడీవో సీఈ కేవలం డిజైన్స్ అండ్ డ్రాయింగ్స్ మాత్రమే ఇస్తారు. మిగిలిన విషయాల్లో వారు తలదూర్చరు. మేడిగడ్డకు సంబంధించిన ప్రతి ప్లాన్, డిజైన్ కమిషన్ వద్ద ఉన్నాయి. కావాలని తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవు అని ఘోష్ హెచ్చరించారు. అనంతరం అదే ప్రశ్నను కొనసాగిస్తూ మీరు చెప్పినట్లుగా ప్రత్యేక సీకెంట్ ఫైల్స్ వాడాలని సీడీవో సీఈ సూచిస్తే అందుకు ఏవైనా లిఖిత పూర్వక ఆధారాలిస్తారా అని ప్రశ్నించారు. దీనికి వెంకటేశ్వర్లు మౌనం వహించటంతో మీ ఇష్టం వచ్చినట్లు కమిషన్ ముందు సమాధానాలు చెప్తే మేము నమ్మాలా నీకు కన్ఫ్యూజన్ ఉంటే నీ దగ్గరే పెట్టుకో కమిషన్ వరకు దానిని తీసుకురావద్దు అంటూ విచారణనకు కొద్దిసేపు ఆపేశారు. మళ్లీ మాట్లాడుతూ ఈ విచారణ ఇంకా పూర్తి కాలేదు. మళ్లీ ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని గుర్తుంచుకోండి అని అసహనం వ్యక్తం చేశారు. అయితే, తన సమాధానాన్ని సరిచూసుకునే అవకాశం ఇవ్వాలని వెంకటేశ్వర్లు కోరగా దీనికి అంగీకరించబోనని, తగిన దస్త్రాలు సమర్పిస్తే సవరించుకునే అవకాశం ఇస్తామని ఘోష్ స్పష్టం చేశారు. వెంటనే వెంకటేశ్వర్లు బదులిస్తూ, తనకు ఆంగ్లంపై పూర్తిగా పట్టు లేదని రికార్డులు చూసి చెబుతానని అనగా, ఇంగ్లిష్ మీద పట్టు లేకుండానే కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్‌గా మీరెలా పనిచేశారు అంటూ ఘోష్ మండిపడ్డారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## దశాబ్దంలో ఎంతో మార్పు

### ఫలితాలు ఇస్తున్న మేక్ ఇన్ ఇండియా

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'మేక్ ఇన్ ఇండియా క్యాంపెయిన్' 10 ఏళ్లు పూర్తి చేసుకుంది. సాధ్యమైనన్ని రకాలుగా 'మేక్ ఇన్ ఇండియా'కు ప్రోత్సాహాన్ని ఇవ్వడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉన్నది. సంస్కరణల మార్గంలో భారతదేశం పురోగతిలో సాగిపోతూనే ఉంటుంది. మనమందరం కలిసికట్టుగా స్వయంసమృద్ధి ('ఆత్మనిర్భర్ భారత్') దిశగా, అభివృద్ధి చెందినటువంటి భారతదేశాన్ని ('వికసిత్ భారత్'ను) ఆవిష్కరించుదామని ప్రధాని పిలుపు ఇచ్చారు. మేక్ ఇన్ ఇండియా ఇతర ప్రధాన విజయాలు 2023–24లో రూ. 1.55 లక్షల కోట్ల విలువైన ఖాదీ విక్రయాలు పీఎల్ఐ పథకం కింద రూ.1.28 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది 8.5 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించింది. 4 లక్షల కోట్లకు పైగా ఎగుమతులు పెరిగాయి. 2020లో టాయ్‌ల కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళికను అమలు చేసినప్పటి నుంచి ఎగుమతులు 239 శాతం పెరిగాయి. గడచిన దశాబ్ద కాలంగా దీక్ష విజయవంతం కావడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన వారికి ప్రధాన మంత్రి తన కృతజ్ఞతలు తెలిపారు. భారత్ మారుతోంది. ఒప్పుడు ఎన్నో దిగుమతులు.. ఇప్పుడు అన్నీ ఉత్పత్తులే. మేకిన్ ఇండియా నినాదం క్రమంగా ప్రతిఫలాలను ఇస్తోంది. ప్రధాని మోదీ కలలు సాకారమవుతుండడంతో పాటు.. దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోంది. 2014లో ప్రతిష్టాత్మకంగా మేకిన్ ఇండియాను లాంచ్ చేశారు మోదీ. భారత్‌ను ప్రపంచంలో టాప్ ఉత్పత్తి దేశంగా మార్చేందుకు కలలు కన్నారు. దీనికోసం పక్కా ప్రణాళికలతో ముందుకు సాగారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు దాని ప్రతిఫలాలను దేశం చూస్తోంది. 2014లో దేశంలో 80శాతం మొబైల్ ఫోన్లను దిగుమతి చేసుకునే పరిస్థితుల్లో ఉంటే.. ఇప్పుడు 99.9శాతం మొబైల్స్ ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. అంతేకాదు.. యూకే, నెదర్లాండ్స్, ఆస్ట్రియా, ఇటలీ, సౌతాఫ్రికా వంటి దేశాలకు ఎగుమతులు కూడా సాగుతున్నాయి. డిఫెన్స్ ప్రొడక్షన్‌తోపాటు.. అంతరిక్షం, ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్ల తయారీ, నిర్మాణ రంగం, రైల్వే ఇన్‌ఫ్రాలోనూ అద్భుత ఫలితాలను సాధిస్తోంది. 10 సంవత్సరాల క్రితం సెప్టెంబరు 25, 2014న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ చొరవ, తయారీపై భారతదేశం పునరుద్ధరణ దృష్టిని లక్ష్యంగా చేసుకుంది. భారతదేశాన్ని అత్యంత ఇష్టపడే ప్రపంచ తయారీ కేంద్రంగా ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశ్యం. పెట్టుబడులను ఆకర్షించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, అత్యున్నత స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించడం ద్వారా భారతదేశాన్ని గ్లోబల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉంచడం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ రంగాలలో ఎగుమతులను పెంచడంలో సహాయపడింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది. ప్రపంచ వేదికపై భారతీయ వ్యాపారాలు తమ సామర్థ్యాలను ప్రదర్శించడానికి అవకాశాలను సృష్టించింది. 'మేక్ ఇన్ ఇండియా' వెనుక ఉన్న విశాల దృక్పథాన్ని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఆత్మనిర్భర్ భారత ని నిర్మించాలనే తన ప్రభుత్వ లక్ష్యంతో ఎలా సక్సెస్ అయ్యిందో పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా క్యాంపెయిన్‌తో ఈ 10 సంవత్సరాలలో భారతదేశం ఎంత మారిపోయింది. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన, స్వయం సమృద్ధిగల దేశంగా మార్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మోదీ హామీ ఇచ్చారు. సంస్కరణలలో భారతదేశం పురోగతి కొనసాగుతుంది. మనం కలిసి ఆత్మనిర్భర్ విక్షిత్ భారత్‌ను నిర్మిస్తామని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. మేక్ ఇన్ ఇండియా ప్రచారం వివిధ రంగాలలో ఎగుమతులను ఎలా పెంచింది. సామర్థ్యాలను సృష్టించింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది. దేశంలో స్టార్టప్‌ల సంఖ్య 2014లో 350 ఉండగా, 10 ఏళ్లలో స్టార్టప్ ఇండియా ప్రోగ్రామ్ కింద నమోదైన వాటి సంఖ్య 1.48 లక్షలకు పెరిగింది. టైర్ ఐఐ , టైర్ ఐఐఐ నగరాల నుండి వచ్చే స్టార్టప్‌లలో 45 శాతం వాటాను 2014 నుండి మంజూరు చేసిన 1 కోటి పేటెంట్లపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. దేశంలో స్టార్టప్ ప్రారంభించిన ప్రతి గంటకు 15 లక్షల ఉద్యోగాలు సృష్టించబడుతున్నాయి. ఎంఎస్ఎంఈ లకు సంబంధించి, ఉద్యమ్ పోర్టల్‌లో 1.85 కోట్ల మహిళా యాజమాన్యంలోని ఎంటర్‌ప్రైజెస్‌తో సహా 4.91 కోట్లకు పైగా నమోదిత ఎంఎస్ఎంఈ లు కొనసాగుతున్నాయి. నమోదిత యూనిట్లు 21.17 కోట్ల ఉద్యోగాలను సృష్టించాయి. 2022–23లో భారతదేశ జీడీపీ కి 30.1 శాతం అందించాయి. బుల్లెట్ రైలు ప్రాజెక్టులు, కొత్త విమానాశ్రయాలు, స్మార్ట్ సిటీలు, రోడ్డు, రైలు నెట్‌వర్క్‌ల విస్తరణతో సహా అనేక పెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మేక్ ఇన్ ఇండియాతో ప్రారంభమైనవే.. ఇది లాజిస్టిక్స్ సమస్యలను పరిష్కరించడమే కాకుండా పారిశ్రామిక యూనిట్లకు మద్దతునిచ్చింది. మేక్ ఇన్ ఇండియాతో, డిజిటలైజేషన్, సాంకేతిక పురోగతి అనేక రంగాలలో కూడా కనిపించింది. ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో స్వావలంబన పెరిగింది. మొబైల్ తయారీలో భారతదేశం అగ్ర దేశంగా మారింది. ఆపిల్, శాంసంగ్ సహా అనేక ఇతర ప్రపంచ కంపెనీలు భారతదేశంలో మొబైల్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేశాయి. 2014లో, భారతదేశంలో కేవలం 2 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేసేవి. ఇది 2020 నాటికి 200 కంటే ఎక్కువ యూనిట్లకు పెరిగింది. మేక్ ఇన్ ఇండియా రక్షణ రంగంలో స్వావలంబనను ప్రోత్సహించింది. భారతీయ కంపెనీలు ఇప్పుడు సైనిక పరికరాలు, ఆయుధాల ఉత్పత్తికి పెద్ద ఎత్తున సహకరిస్తున్నాయి. రక్షణ రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని ప్రభుత్వం 74 శాతానికి పెంచింది. తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్' సహా అనేక స్వదేశీ రక్షణ పరికరాల ఉత్పత్తి ఈ చొరవలో ముఖ్యమైన భాగం

## సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం

- విద్యార్థులు భవిష్యత్తులు తీర్చిదిద్దుకోవాలి
- సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ కురుమయ్య



నర్వ, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్:): జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మక్తల్ నియోజకవర్గ పరిధిలోని నర్వ మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో శనివారం రోజు స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ కురుమయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు ఫోన్ చేసి బాల్యవివాహాలు నిర్మూలించాలని ఏదైనా విద్యార్థులకు అపాయం కలిగినప్పుడు 100 కు కాల్ చేయాలని సిఐ అన్నారు.



విద్యార్థులు కచ్చితంగా సైబర్ నేరాలు మోసాల పట్ల పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని ఏ విషయంలోనైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సైబర్ నేరాల పట్ల నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సెల్ఫోన్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు. గుర్తుతెలియని వ్యక్తులు మీకు ఫోన్ చేసి మీ ఏటీఎం పిన్ నెంబర్ సివివి బ్యాంకు ఖాతా తదితర వివరాలు కోరితే ఇవ్వరాదన్నారు. ఏ విధమైన మీరు మీ బ్యాంక్ ఖాతా నుండి డబ్బును కోల్పోతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎలాంటి ఆపాద సమయంలో సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి లేదా 100 కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తులను తీర్చిదిద్దుకోవాలని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని మహిళలపై చిన్న పిల్లలపై జరుగుతున్న అగైత్యాలను అరికట్టాలని ఉద్దేశంతోనే ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఆయన అన్నారు. ఇట్టే కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపల్ శిరీష పోలీస్ సిబ్బంది రఘు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే ఆలోచన భగత్ సింగ్ భావాలతో ప్రజా ఉద్యమాలను ఉదృతం చేస్తాం

### వాస పల్లయ్య సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ హుజూర్నగర్ డివిజన్ కన్వీనర్



నేరేడుచర్ల, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): మహాత్మ జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ స్ఫూర్తితో భగత్ సింగ్ అందించిన ధైర్యంతో ప్రజా ఉద్యమాలను ఉదృతం చేస్తామని ఉత్తం పద్మావతి నగర్లో సత్యశోధక్ 152 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాసులైన పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాస్ లైన్ పార్టీ హుజూర్నగర్ డివిజన్ కన్వీనర్ వాస మల్లయ్య మాట్లాడుతూ కుల మతాలు లేని సమ సమాజం కావాలని స్త్రీలకు విద్యను అందించాలని మహాత్మ జ్యోతిరావు పూలే సత్యశోధకులు స్థాపించి తన భార్య సావిత్రిబాయి పూలే తోటి మహిళలకు చదువు చెప్పిన మహోన్నత వ్యక్తులని వారు కోరిన సమాజం కోసం ప్రతిక్షణం ప్రయాణం చేస్తామని అన్నారు. భగత్ సింగ్ ఇచ్చిన స్వతంత్ర పోరాట స్ఫూర్తి రగిలించిన విప్లవస్ఫూర్తితో అనువణువునా ఆయన ఆశయాలను నింపుకొని భారత దేశంలో విప్లవ సామ్రాజ్య స్థాపనకై కులమతాలైన సమాజంకై ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతామని అన్నారు ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, వాస కరుణాకర్, పి ఓ డబ్ల్యు నియోజకవర్గ అధ్యక్షురాలు చందబోయిన లక్ష్మి, కార్యవర్గ సభ్యురాలు శ్యామల,, రజాక్ సైదులు నరసమ్మ జానీ బేగం, మాలాంబి, మరియమ్మ రమణ మల్లేశ్వరి దుర్గమ్మ రంగయ్య, ఫాతిమా, దేవయ్య, అంతటి మమత, సిలువే రేణుక, పొన్నూరు లక్ష్మమ్మ తదితరులు పాల్గొనడం జరిగింది.

## నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 129వ జయంతి



నేరేడుచర్ల, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): నవయుగ వైతాళికుడు కవి చక్రవర్తి జాతీయ ఉత్తమ రచయిత అవార్డు గ్రహీత గుర్రం జాషువా 129వ జయంతిని నేరేడుచర్ల లోని అరిబండి భవన్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆనాటి సమకాలిన పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేసి, తాను జీవితంలో అనుభవించిన కుల వివక్ష, అంటరానితనం, అవమానాలు సామాజిక ఇతివృత్తాలుగా చేసుకొని ఆయన రచించిన కవితలు ఖడ్గ సృష్టి, శిశువు, పిరదౌసి, గబ్బిలం, స్వయంవరం, కొత్త లోకం కాందేశికుడు వంటి కవితల ద్వారా ప్రజలను చైతన్య పరచి, సమాజంలోని రుగ్మతలను రూపుమాపా టానికి ఆయన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో కుల వివక్షత అంటరానితనం కుల నిర్మూలన ఆత్మ గౌరవం కోసం ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పారేపల్లి శేఖర్ రావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ధనుంజయ నాయుడు, బచ్చలకూరి సుందర్ రావు, కొదమగుండ్ల నాగేష్, సిరికొండ శ్రీను, రాచకొండ అజయ్, ఇంజమూరి వెంకటయ్య, జిలకర రామస్వామి, రాపోలు నవీన్, నీలా రామ్మూర్తి, చిలకరాజు శ్రీను, ఎడ్ల సైదులు, వింజమూరు మల్లయ్య, జీడిమెట్ల రవి వాసా శ్రీను, కొమరాజు వెంకట్, అశోక్ యాదవ్, గుర్రం సైదులు తదితరులు పాల్గొన్నారు.

## 12 ఏళ్ల పసితనంలో దేశం కోసం యోచించిన భగత్ సింగ్: జయ రాములు




ఆత్మకూర్, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): 12 ఏళ్ల పసితనంలోనే దేశం గురించి ఆలోచించిన దేశభక్తుడు, పోరాటయోధుడు భగత్ సింగ్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయ రాములు అన్నారు. ఆత్మకూర్ మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 117వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కుతుబ్ అధ్యక్షత వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయరాములు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 12 ఏళ్ల వయసులో భారతీయులు అమరులైన జలియన్వాలాబాగ్ను సందర్శించి ప్రభావితుడయ్యారన్నారు. మహాత్మా గాంధీ, బాలగంగాధర్ తిలక్ తదితర నాయకులు దేశం కోసం పోరాడుతుండగా విభిన్న పోరాట మార్గాన్ని భగత్ సింగ్, ఆజాద్, చంద్రశేఖర్, రాజ్గురు, సుఖదేవ్ తదితర యువత ఎంచుకున్నారన్నారు. స్వాతంత్రం కావాలని బ్రిటిష్ పార్లమెంటుపై భగత్ సింగ్ పొగ బాంబులు విసిరి పారిపోకుండా పట్టుబడి, స్వరాజ్య ఆకాంక్షను చాటారన్నారు. తీహార్ జైల్లో ఆయనను పెట్టారన్నారు. క్షమాభిక్ష కొరితే వదిలిపెట్టే అవకాశం ఉన్నా, ఆ పని చేయలేదని దేశం కోసం ఉరికోయ్యను ముద్దాడటానికే సిద్ధపడ్డారన్నారు. తన తల్లిదండ్రులు క్షమాభిక్ష కోరేందుకు కూడా అంగీకరించని త్యాగశీలి, పోరాటయోధుడు భగత్ సింగ్ అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన దేశభక్తుడు, పోరాటయోధుడు భగత్ సింగ్ అని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని సమాజంలో మార్పు కోసం, ప్రజల సమస్యలపై పోరాడాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి కుతుబ్, ఆత్మకూరు పట్టణ ఏఐవైఎఫ్ అధ్యక్షుడు రవి, కార్యదర్శి యూనుస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి శ్రీహరి, డిహెచ్పిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రవీందర్, సిపిఐ జిల్లా నేత లక్ష్మీనారాయణ శెట్టి, సిపిఐ పట్టణ అధ్యక్షుడు లింగన్న, ఐ వై ఎఫ్ నాయకులు ఇమామ్, ఎండి పాషా, జహంగీర్, జమీల్, చరణ్, మహమ్మద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేరేడుచర్ల అయ్యప్ప స్వామి దేవస్థానం 41వ రోజు పండుగ



నేరేడుచర్ల, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల నూతన దేవాలయం అయ్యప్ప స్వామి 41వ రోజు పూజా కార్యక్రమంలో పాల్గొన్నవారు . అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖులు నెరేడుచెర్ల ఎస్ఐ రవీందర్ నాయక్ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్ వైస్ చైర్మన్ అలక సరిత సైదిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సురేష్ రెడ్డి, కొనతం చిన్న వెంకటరెడ్డి, నాగండ్ల శ్రీధర్, కొనతం కృష్ణారెడ్డి, కౌన్సిలర్ భరత్ లలిత వేమూరి నాగమణి నారాయణ నాగయ్య వేద వెంకటరమణ శర్మ నారాయణ శర్మ చిన్నపల్లి శ్రీనివాస్, మన్యం దుర్గారావు, యారవ సురేష్, మంగళగిరి కిషోర్, చిట్యాల శ్రీను, ఐల శ్రీను, పూర్ణ చంద్ర రెడ్డి సార్, యామిని వీరయ్య ,బోరింగ్ లక్ష్మారెడ్డి, దేవులపల్లి శంకరాచారి, రామరాజు, సతీష్, రామలింగ ,రాంబాబు, చారి, వెంకటేష్, కోదాటి నాగయ్య, సురసాని వెంకటరెడ్డి కనకా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ అధికారిని సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు



ఆత్మకూరు, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం నూతన విద్యాశాఖ అధికారిగా ఆత్మకూరు పట్టణానికి చెందిన కొండాపురం బాలరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండలం బిఆర్ఎస్ నాయకులు రవికుమార్ యాదవ్ మండల పార్టీ ఆధ్వర్యంలో నూతన విద్యాశాఖ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, ఆత్మకూరు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ జి వేణుగోపాల్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ సభ్యులుగా ఇద్దరూ ఎంపిక



### – సీనియర్ న్యాయవాదులు దివాంజి అశోక్ కుమార్, వై. విజయభాస్కర్ రెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్ట్ లోక్ అదాలత్ కమిటీ సభ్యులుగా మరో ఇద్దరు ఎంపికైనట్లు లోక్ అదాలత్ సభ్యులు పేర్కొన్నారు. ఎంపికైన వారిలో దివాన్జి అశోక్ కుమార్ , వై విజయభాస్కర్ రెడ్డి ఉన్నారు. వీరి ఎంపిక వారసత్వంగా న్యాయ వాద వృత్తిలో ఉన్నందున ఎంపిక కావడం జరిగింది. దివాన్జీ అశోక్ రావు తండ్రి కీర్తిశేషులు గోపాలరావు మొదటి న్యాయవాద విద్య ను ఈ ప్రాంతంలో అభ్యసించి, ఈ కోర్టు నందు న్యాయవాదిగా కొనసాగినారు. అందుకు వారు వారసత్వంగా అతని కుమారుడు అశోక్ కుమార్ ను లోక్ అదాలత్ సభ్యుడిగా ఎన్నుకున్నారు. అదే విధంగా వై.విజయ భాస్కర్ రెడ్డి సీనియర్ న్యాయవాది తిప్పారెడ్డి గత కొంతకాలం నుండి న్యాయవాద వృత్తిలో ఉన్నారు. అందుకుగానూ వారసత్వంగా విజయభాస్కర్ రెడ్డికి లోక్ అదాలతో సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తోటి న్యాయవాదులు, పట్టణ ప్రజలు ఇద్దరినీ అభినందించారు.

## ఫారెస్ట్ అధికారులను కొట్టిన నిందితులను కోర్టులో హాజరుపరచిన పోలీసులు

తాడ్వాయి : ములుగు జిల్లా తాడువాయి మండలం దామెరవాయి అటవీ ప్రాంతంలో జెసిపి సహాయంతో అడవిని నాశనం చేస్తున్నారని సమాచారం మేరకు, సంఘటనా స్థలానికి వెళ్లి జెసిపిని తీసుకొని వస్తున్న క్రమంలో మధ్యలో ఫారెస్ట్ అధికారులను దాడి చేసి ఘటనలోని నిందితులు గంట సూరజ్ రెడ్డి, పాండవుల శశిధర్, పాండవుల సాయి రవిచంద్ర, నీరటి శ్రీకాంత్, మాదరి చంటి నాపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో జెసిబి ని స్వాధీనం చేసుకొని ఐదుగురు యువకులను అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పరిచి అనంతరం వారిని ఖమ్మం జైలుకు తరలించారు.

# డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి

అమరచింత, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత పట్టణ కేంద్రంలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ జిఎస్ గోపి పూలమాల వేయడం జరిగింది. డివైఎఫ్ఐ జెండాను డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర ఎగరవేయడం జరిగింది. ఈ సందర్భంగా జిఎస్ గోపి.అజయ్, రాఘవేంద్ర లు మాట్లాడుతూ 1907సెప్టెంబర్ 28న పంజాబ్లో జన్మించిన భగత్ సింగ్23 ఏళ్ల వయసులోనేఉరి కంబాన్ని ముద్దాడరని కొనియాడారు. కార్మిక వ్యతిరేక విధానాలు తీసుకొచ్చిన బ్రిటిష్ ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ ఆనాడే పార్లమెంట్లో పొగ బాంబులు వేసి పారిపోకుండా అరెస్టయి తమ వాదనలను కోర్టులో వినిపించారని అంతటి నికార్సైన భగత్సింగ్ అని కొనియాడారు.

జలియన్ వాలి బాగ్ ఘటనతో తీవ్రత కలత చెందిన భగత్ సింగ్ డ య్యార్ అనే బ్రిటిష్ పోలీస్ అధికారిని ని చంపే వరకు నిద్ర పోలేదని ఇలా భగత్ సింగ్ యువతలో ఉత్తేజం నింప్పి బ్రిటిష్ రాజ్యాన్ని గడగడలాడించిన వ్యక్తి అని. భగత్ సింగ్ రాజ్ గురు సుఖ్ దేవ్. ప్రాణాలు వృధా కాలేదని. కొనియాడారు. బ్రిటిష్ పరిపాలనపై యువతను పెద్ద ఎత్తున ఉద్యమించే విధంగా ప్రోత్సహించిన భగత్




సింగ్ ను చూసి భయపడిన వారుఅతనిని ఉరి తీసిన తన లక్ష్యం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టారని అన్నారు. నేటి యువత భగత్ సింగ్. ను ఆదర్శంగా తీసుకొని. మద్యం డ్రగ్స్ లాంటి దురలవాట్లకు దూరంగా ఉండి. ఉద్యోగ ఉపాధి సమస్యలపై పోరాడాలని పిలుపు నీచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బుచ్చన్న కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యాక్షులు శ్యాంసుందర్. విజయ్. డివైఎస్ఎఫ్ నాయకులు. నేపోల్ కర్ణ.మోహన్ రవి సంసోను.రాజు తదితరులు పాల్గొన్నారు.

# మన్ కి బాత్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

**– వచ్చేనెల 15వ తారీకు వరకు బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం**

**– బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి**



ఆత్మకూరు, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): నేడు జరగబోయే దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కి బాత్ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ పరిధిలోని బిజెపి సీనియర్ నాయకులు,పదాధికారులు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మండల బూత్ స్థాయి, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఇన్చార్జిలో కన్వీనర్లు, కో కన్వీనర్లు, మహిళా మోర్చా, కిసాన్ మోర్చా ఓబిసి యువ, ఎస్సీ,ఎస్టీ మరియు మైనార్టీ మోర్చాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఇన్చార్జీలు కన్వీనర్లు, కో కన్వీనర్లు శక్తి కేంద్రాల ఇన్చార్జులు మరియు ప్రతి ఒక్క బీజేపీ కుటుంబ సభ్యుడు తప్పనిసరిగా మన్ కి బాత్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన అన్నారు.అదేవిధంగా ఆగస్టు 15వ తారీకు వరకు బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం పొడిగిస్తున్నట్లు తెలంగాణ బిజెపి రాష్ట్ర శాఖ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కావున ప్రతి ఒక్క కార్యకర్త జోరుగా బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కొనసాగించాలని లక్ష్యానికి మించి సభ్యత్వ నమోదు చేయాలని కార్యకర్తలకు పలు సూచన సలహాలు తెలియజేశారు.

# మృతి దేహానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించిన ధనసరి





మంగపేట, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): శనివారం మంగపేట మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు పుప్పాలా నరసింహ తల్లి పేరేటమ్మా స్వర్గస్థులు అయ్యారు అని తెలిసి వారి నివాసం వద్దకు వెళ్లి మృతి దేహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియపరిచి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్ని వేళలా వారికీ అండగా వుంటా అని భరోసా నిచ్చిన రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు గౌరవ శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క కుమారుడు యువనాయకుడు రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రటరీ ధనసరి సూర్య అదేవిధంగా రాజుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కారం పాపారావు ఇటీవల అనారోగ్యం తో స్వర్గస్థులు అవ్వగా వారి నివాసం వద్దకు వెళ్లి అయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా నర్సింహాసాగర్ (గాంధీ నగర్) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పలపాటి ప్రభాకర్ తండ్రి ఇటీవల కాలంలో స్వర్గస్థులు అవ్వగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు, సీనియర్ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కొత్త ఆలోచనలపై దృష్టి పెట్టాలి

**– పింగిలి కాలేజి ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని**

హన్మకొండ జిల్లా, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): విధర్తులు కొత్తదనంతో అలోచించి నూతన ఆవిష్కరనలపై దృష్టి పెట్టాలని హన్మకొండ వడ్డేపల్లి లోని పింగిలి జూనియర్ కాలిజిలో ఏర్పాటు చేసిన ఫ్రేషేర్స్ డే కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కొత్త విద్యార్థులకు ఆప్యాయంగా స్వాగతం పలకడమే ఈ పార్టీ ప్రధాన లక్ష్యం. ఇలాంటి పార్టీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి వారి సృజనాత్మకతను పెంపొందిస్తాయి. మానవతంతో కూడిన ప్రవర్తనతో పాటు వినయ






విధేయతలు, విశ్వాస పూర్ణమైన నడవడికను అలవరచుకోవాలని, ఉన్నత స్థాయిలో ఆలోచనలు ఉండాలని, ఎక్కడ ఉన్న తల్లి దండ్రులను గురువులను మరవరాదని అన్నారు. ఫ్రెషర్స్ డే అనేది జూనియర్లు తమలో దాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించే వేదిక. ఈ ఫ్రెషర్ పార్టీ ద్వారా ప్రారంభ మరియు ఇప్పటికే ఉన్న విద్యార్థుల ప్రతిభను అన్వేషిస్తాయి. సత్ప్రవర్తనతో తోటి విద్యార్థుల పట్ల స్నేహ భావంతో మెలుగుదాం. మన కళాశాల నిబంధనలను పాటిస్తూ, క్రమశిక్షణతో, ఉన్నతమయిన విద్యాబుద్దులు నేర్చుకోని మనమందరం జీవితంలో ఉన్నత శిఖరాలధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏ. నాగరాజు, డివిజన్ అద్యక్షులు తాళ్ళపల్లి స్సుధాకర్, ఏ. పున్నం చందర్, తాళ్ళపల్లి మేరీ, మండల సమ్మయ్య, మొహమ్మద్ ముస్తాక్ నేహాల్, పింగిలి, ఉపాద్యాయులు, కాలేజి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా టీవైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుని జన్మదిన వేడుకలు

మెదక్, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): మెదక్ జిల్లా కౌడిపల్లి తునికి నల్ల పోచమ్మ ఆలయంలో టీవైజెఎఫ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తనుగుల జితేందర్ రావు కుటుంబ సభ్యుల పేరు మీద ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అర్చన వంటి కార్యక్రమాలు చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం డి రామానాయుడు వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ, కేక్ కట్ చేయడం జరిగింది, అలాగే కౌడిపల్లి ప్రభుత్వహాస్పిటల్లో రోగులకు పండ్ల పంపిణీ చేయడం జరిగింది వృద్ధాశ్రమంలో వృద్ధులు మాట్లాడుతూ టీవైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జితేందర్ రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో చల్లగా ఉండాలని వారు దీవెనలు అందించారు అనంతరం కౌడిపల్లి రామానంద చటర్జీ ప్రెస్ క్లబ్ లో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు చారి, ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు చారి, మాట్లాడుతూ టీవైజెఎఫ్ యూనియన్ స్థాపించి జర్నలిస్టుల కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రభుత్వం తరఫున జర్నలిస్టులకు రావలసిన కావలసిన హక్కుల సాధన కోసం ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ యూనియన్ సభ్యులకు ఏ సమస్య వచ్చినా తక్షణమే అక్కడ వాలిపోయి సమస్యలని పరిష్కరించడంలో అలుపెరుగని జితేంద్రుడు, అలాంటి గొప్ప వ్యక్తి జన్మదినాన్ని జరుపుకుంటున్న అందుకు



జర్నలిస్టులకు గర్వకారణం అని అన్నారు. జర్నలిస్ట్ యూనియన్ తరపున కౌడిపల్లి రామానంద చటర్జీ ప్రెస్ క్లబ్ తరుపున జితేందర్ రావు కి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టివైజెఎఫ్ యూనియన్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ నాగరాజు చారి, టీవైజెఎఫ్ రాష్ట్ర నాయకులు రవికుమార్ గౌడ్, కొల్చారం మండలం అధ్యక్షుడు శ్రీశైలం, సభ్యులు మధు, మెదక్ వనదుర్గా మాత ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆకుల యాదగిరి, రవి, భరత్ గౌడ్, రమేష్, లింగం గౌడ్, జమీర్, శ్రీశైలం, ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గులవాగు ప్రాజెక్ట్ నీటిని నింపేందుకు పరిశీలించాలి

**– జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా బొగ్గులవాగు ప్రాజెక్ట్ నీటిని నింపేందుకు సాధ్యా సాధ్యాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

శనివారం మలహార్ మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. పాత రుద్రారం ఊర చెరువు విస్తరణ పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఊర చెరువు నుండి బొగ్గులవాగు ప్రాజెక్ట్ కు అనుసంధానం చేస్తూ నీటిని తరలించేందుకు ఇరిగేషన్, అటవీ, రెవెన్యూ అధికారులతో కలిసి బొగ్గుల వాగు ప్రాజెక్ట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ నుండి రుద్రారం ఊర చెరువుకు, ఊర చెరువు నుండి బొగ్గుల వాగు ప్రాజెక్ట్ కు నీటిని తరలించేందుకు కాలువలు, ఎత్తిపోతల అవసరతపై అధికారులు సర్వే నిర్వహించి ప్రతిపాదనలు అందించాలని ఆదేశించారు. బొగ్గులవాగు ప్రాజెక్టు పూర్తిగా వర్షాధారిత ప్రాజెక్టు అని, అలాకాకుండా చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నదిజలాల ను బొగ్గులవాగు ప్రాజెక్ట్ కు తరలించడం ద్వారా బొగ్గుల వాగు ప్రాజెక్టు కింద అదనపు ఆయకట్టు సాగులోకి వస్తుందని తెలిపారు. అనంతరం తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ ఉపరితల ఘనిని పరిశీలించి తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ నుండి గణపురం మండలం చెల్పూరు కేటిపిపి కి బొగ్గును తరలించడానికి ఏర్పాటు చేయబోయే కన్వేయర్ బెల్ట్ గురించి జెన్కో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ ఉపరితల గని నుండి చెల్పూర్ కేటిపిపికి ప్రస్తుతం 68 కిలోమీటర్ల దూరం ఉంటుందని కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేయడం వల్ల 17.2 కిలోమీటర్ల దూరం మాత్రమే వస్తుందని రవనాభారం తగ్గుతుందని తెలిపారు.

అంతకుముందు తాడిచర్ల ఎస్సి కాలనీ ఆర్ అండ్ ఆర్ స్థలాన్ని పరిశీలించారు. తదపరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పి.ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. జూనియర్ కళాశాలలో ఫ్లోర్ మొత్తం దెబ్బతిన్నదని మరమ్మతులు నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందించాలని పీఆర్ ఇంజినీరింగ్ అదికారులకు సూచించారు. అసంపూర్తిగా నున్న కిచెన్ షెడ్ పూర్తి చేయుటకు అలాగే కళాశాల ప్రారంభం నుండి లోపలి వరకు సిసి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య, సీఈ సిద్దయ్య, తహశీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో ఉపాధి కోసం నిరంతర పోరాటం

**డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి**

హనుమకొండ, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): దేశం కోసం పోరాటం చేసి చిన్న వయస్సు లోనే ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ స్ఫూర్తితో దేశంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేంతవరకు పాలకులపై డివైఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి అన్నారు. శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో భగత్ సింగ్ 117 వ, జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. దేశం కోసం యుక్త వయసులోనే ప్రాణత్యాగం చేసి దేశంకోసం ఉరితాడు ముద్దాడిన యోధుడు అని కొనియాడారు భగత్ సింగ్ పన్నెండేళ్ల వయసులో ఉన్నప్పుడు జలియన్ వాలాబాగ్ దుర్ఘటన జరగగా ఆ సంఘటన ఆయన వ్యక్తిత్వం పై పెను ప్రభావం చూపిందిని, ఆ యుద్ధ భూమిని ముద్దాడి అక్కడ రక్తంతో తడిసిన ఆ మట్టిని తన గదిలో పెట్టుకుని నిత్యం బ్రిటిష్ వారిపై పగ తీర్చుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాడని అన్నారు. ఆయన పేరు చెబితే శత్రువుల గుండెల్లో వణుకు పుట్టేదని భగత్



సింగ్ మాటలు తుపాకీ తూటాల కన్నా విలువైనవి అని నేటి యువత భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని అందరికీ విద్య, ఉపాధి కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఓ. చిరంజీవి, జిల్లా కమిటీ సభ్యులు మొలుగురి అశోక్, నాయకులు శ్రీకాంత్, రాజు, అనీల్, కుమార్ రవితేజ, రాజేందర్ పాల్గొన్నారు.

# మన దేశ సంస్కృతి సాంప్రదాయాలను యువత కాపాడాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టీస్**



ములుగు జిల్లా, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): మన దేశ సంస్కృతి సంప్రదాయాలను యువత కాపాడాలని జిల్లా కలెక్టర్ దివాకర టీస్. యువతను కోరారు. శనివారం జిల్లా కేంద్రం లోని గిరిజన సంక్షేమ భవనంలో జిల్లా యువజన మరియు క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు, సైన్స్ మేళా, యువజన కళకారుల ఎంపిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. హాజరై స్వామి వివేకానంద్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో ఉన్న ప్రతిభను వెలికితీయటానికి యువజన ఉత్సవాలు ఎంతగానో దోహద పడతాయని అన్నారు. ప్రతి వ్యక్తిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని దానిని బయట తీయటానికి యువజన ఉత్సవాలు ఎంతగానో సహకరిస్తాయని అన్నారు. స్వామి వివేకానందుని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని యువత తలుచుకుంటే సాధించనిది ఏమీ లేదని అన్నారు. యువత చెడు మార్గంలో పయనించకుండా సన్మార్గంలో పయనించాలని అన్నారు. జిల్లాలోని కళాకారులు ప్రదర్శించిన యువజన ఉత్సవాలకు మంచి స్పందన లభించింది. జిల్లాలోని కళాకారులు తమ కలలను ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, జిల్లా యువజన క్రీడా అధికారి ఇంచార్జీ తుల రవి, జిల్లా ఇతర అధికారులు, ఉద్యోగులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఫైనల్ ఓటరు జాబితా ప్రకటించిన అధికారులు

**మండలంలో మొత్తం ఓటర్లు 21022**

పాలకీడు, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): పాలకీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో లక్ష్మి గ్రామపంచాయతీ ఫైనల్ ఓటర్ జాబితా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామపంచాయతీలకు సంబంధించిన వార్డ్ వారిగా ఓటర్ జాబితాను గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంచారని తెలిపారు. ఫైనల్ జాబితా ప్రకారం మండలం లోని 22 గ్రామపంచాయతీలు ఉండగా మొత్తం 21022 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 10149 కాగా స్త్రీలు 10873 మంది



ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపివో వీరయ్య, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాలపై కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం

మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లాలోని వెనుకబడిన తరగతులు, సాంఘిక సంక్షేమ శాఖ, వసతి గృహాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సానిటేషన్ పక్కాగా నిర్వహించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం కల్పించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో 15,రోజులకు ఒకసారి విద్యార్థిని, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వసతి గృహాలకు ప్రత్యేక అధికారులను నియమించి హాస్టల్ నిద్ర కార్యక్రమాలు, నిర్వహణ కార్యక్రమాలపై ప్రతినిత్యం తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వసతి గృహాలలో చదువుకుంటున్న పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత వార్డెన్లను ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నరసింహస్వామి, సాంఘిక సంక్షేమ అధికారిని నర్మద, ఎస్సీ బీసీ వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జన్మదిన వేడుకలు

### వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

ఆత్మకూర్, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయచూర్ పరమేష్ జన్మదిన వేడుకలు సందర్భంగా రేచింతల గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నల్గొండ శ్రీనివాసులు, మక్తల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తులసిరాజ్ యాదవ్, గోపన్ పేట కాంగ్రెస్ పార్టీ నాయకులు బషీర్, రేచింతల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ సరోజా రాఘవేంద్ర మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రాము, జి.మహేష్, ఎం.రాజు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కోసం సీఎంకు లేఖ



ఆత్మకూరు, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): ఆత్మకూరు పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ చేయడం మరియు సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ పంపినట్లు ఆత్మకూరు బార్ అసోసియేషన్ మరియు సీనియర్ న్యాయవాది తిప్పారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన కోర్టు ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు బార్ అసోసియేషన్ న్యాయవాదుల నుండి ముఖ్యమంత్రికి ఆత్మకూరు రెవెన్యూ డివిజన్, సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని లేఖ పంపినట్లు ఆయన తెలిపారు. ఇట్టి లేఖ ప్రతులను విలేకరులకు అందజేశారు. ఇట్టి లేఖలోని ప్రధానంగా ప్రధాన విషయాలను ఆయన తెలియజేశారు. ఆత్మకూరు ఇదివరకు పెద్ద పట్టణము తాలూకా ప్రధాన కేంద్రం, అయితే ఇటీవల కొత్త మండలాలు జిల్లాల ఏర్పాటుతో ఆత్మకూరు చిన్న పట్టణంగా మారిపోయింది. కావున ఆత్మకూరు న్యాయవాదులు మరియు ప్రజలు వివిధ గ్రామాల ప్రజలు ప్రధానంగా ఆత్మకూరు పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ చేయాలని మరియు సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని ఇట్టి కోర్టుకు అనుబంధంగా కొత్తకోట, మదనాపూర్, అమరచింత, పెబ్బేరు మండలాలను చేర్చాలని పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి సబ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఆత్మకూరు ప్రజలు కొత్త రెవెన్యూ డివిజన్ కోసం చాలా రోజుల నుంచి డిమాండ్ చేస్తున్నారని, చాలా ప్రయత్నాలు చేసి విఫలమైనట్లు ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా నాయకులు హామీ ఇచ్చారని కావున ఆత్మకురు కు ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారు కోరినట్లు తెలిపారు. ఇటీ లేఖ ప్రతులను తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జిల్లేల చిన్నారెడ్డి, స్థానిక మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి, వనపర్తి శాసనసభ్యులు మెగా రెడ్డి, వీరికి పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూర్ బార్ అసోసియేషన్ సభ్యులు సి రామేశ్వర్ రెడ్డి, డి అశోక్ కుమార్, జీకే రాములు,వై విజయభాస్కర్ రెడ్డి, మొగిలి గంగాధర్ గౌడ్, సాయి కృష్ణ, శంకర్ లింగం, ముక్తేశ్వర్, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న క్యాన్సర్ రోగులు

- ప్రతి రోజు 150 నుంచి 160 కొత్త కేసులు
- పరిమితంగా ప్రభుత్వ సేవలు
- జిల్లాలకు విస్తరించాలని సర్కారు నిర్ణయం




హైదరాబాద్: పెరుగుతున్న క్యాన్సర్ రోగుల సంఖ్యకు అనుగుణంగా చికిత్స సౌకర్యాలను జిల్లాలకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్, రంగారెడ్డి మినహా అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో క్యాన్సర్ రీజనల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. ఇందులో భాగంగా తొలి దశలో కొత్తగూడెం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కరీంనగర్‌లో సెంటర్లను నెలకొల్పాలని యోచిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఒక్కో సెంటర్‌ను సుమారు రూ.50 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మించనున్నారు. ఆ తర్వాత రెండో దశలో మిగిలిన జిల్లా కేంద్రాల్లో సెంటర్లను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం, స్క్రీనింగ్ చేయడం, ఆయా జిల్లాల్లో ఉన్న క్యాన్సర్ పేషెంట్లకు ఎంఎన్‌జే హాస్పిటల్ డాక్టర్లు సూచించిన ట్రీట్‌మెంట్‌ను అందించడం వంటివి ఈ సెంటర్ల ప్రథమ లక్ష్యం. ఇందుకోసం ఆయా సెంటర్లలో ఆంకాలజిస్టులను, రేడియాలజిస్టులను నియమించడంతో పాటు, జిల్లా హాస్పిటళ్లలో పని చేసే డాక్టర్లు, సిబ్బందికి శిక్షణనిస్తారు. అవసరమైన పరికరాలను ఏర్పాటు చేస్తారు. అలాగే, వరంగల్‌లో ఇప్పటికే ఉన్న రీజనల్ క్యాన్సర్ సెంటర్‌ను హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే తరహాలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందేలా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆరోగ్యశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని నేషనల్ కేన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ (ఎన్‌సీఆర్పీ) అంచనా ప్రకారం మన రాష్ట్రంలో ప్రతిరోజు సగటున 150 నుంచి 160 మంది కేన్సర్ బారినపడుతున్నారు. ఈ సంఖ్య ఏడాదికేడాది పెరుగుతున్నది. రాష్ట్రంలో 2016 సంవత్స రంలో కొత్తగా 43,129 కసులు నమోదు కాగా, ఆ సంఖ్య 2018 నాటికి 52,000లకు పెరిగింది. రాష్ట్రంలో 2030 నాటికి ప్రతి సంవత్సరం 65,000 మందికి క్యాన్సర్ డయాగసిస్ అయ్యే అవకాశం ఉందని ఐసీఎంఆర్ అంచనా వేసింది. మన రాష్ట్రంలో దాదాపు 60 శాతం క్యాన్సర్లకు జీవనశైలిలో వచ్చిన మార్పులు, కాలుష్యమే కారణమని డాక్టర్లు చెబుతున్నారు. రాష్ట్రంలోని 4 కోట్ల మందికి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రే దిక్కు. ప్రస్తుతం ఎంఎన్‌జేలో 750 బెడ్లు ఉన్నా, పేషెంట్ల రద్దీకి అవి సరిపోవడం లేదు. దీంతో డే కేర్ సిస్టమ్‌ను తీసుకొచ్చారు. కీమోథెరపీ చేసిన పేషెంట్లను ఒకట్రెండు గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచి, అదే రోజు సాయంత్రాని కల్లా డిశ్చార్జ్ చేస్తున్నారు. తెలంగాణతోపాటు సరిహద్దు రాష్ట్రాలైన ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ నుంచి కూడా ఇక్కడికి పేషెంట్లు వస్తున్నారు. రోజూ 650 నుంచి 700 వరకూ ఓపీ కేసులు నమోదవుతున్నాయి. వరంగల్‌లో రీజనల్ కేన్సర్ హాస్పిటల్ ఉన్నప్పటికీ, అక్కడ పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. క్యాన్సర్ పేషెంట్లలో 70 శాతం మందికి కీమోథెరపీ అవసరమవు తుంది.

పేషెంట్ పరిస్థితిని బట్టి మూడు వారాలకు ఒకసారి కీమోథెరపీ చేయాల్సి ఉంటుందని ఆంకాల జిస్టులు చెబుతున్నారు. దీంతో కనీసం నెలకు ఒక్కసారైనా పేషెంట్లు హాస్పిటల్‌కు రావాల్సి ఉంటుంది. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా ఇటీవలే ఈ అంశంపై అధికారు లతో సమీక్షించి ప్రతిపాదనలు సిద్ధం చేయా లని ఆదేశించారు. ఆయన ఆదేశాలతో 5 రీజనల్ సెంటర్లకు అధికారులు ప్రతిపాదనలు పంపించినట్టు సమాచారం.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆకస్మికం తనిఖీ

జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం మల్హర్ మండలంలోని రుద్రారం ఎంపిపిఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారితో ఇంగ్లీష్ పాఠాలు చదివించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. విద్యార్థులు ఆంగ్ల పాఠాలు చక్కగా చదవడం పట్ల అభినందించారు. విద్యార్థులు. మంచిగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు చేపట్టిన మరమ్మతు పనులు, మంచినీటి సౌకర్యం, హ్యాండ్ వాష్, డిజిటల్ విద్యాబోధన వంటి అంశాలను ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజన కార్మికులు నెల నెలా వేతనాలు చెల్లింపుతో పాటు, గ్యాస్



మంజూరు చేయాలని కోరగా తగు చర్యలు తీసుకుంటాని తెలిపారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ అక్రమాలపై చర్యలెందుకు తీసుకోలేదు?

హైదరాబాద్: జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ మేనేజింగ్ కమిటీ అక్రమాల రిపోర్టు అందినా ఎందుకు చర్యలు తీసుకోలేదని కో-ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ ఎం.హరితను హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు ఆదేశించినా చర్యలు తీసుకోకపోతే ధిక్కరణ చర్యగా పరిగణించి జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించింది. జూబ్లీ హిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అక్రమాలపై తాము దాఖలు చేసిన ఫిర్యాదుపై చేపట్టిన విచారణ నివేదికను బహిర్గతం చేయడంలో కమిషనర్ ఫర్ కో ఆపరేటీవ్ రిజిస్ట్రార్ నిర్లక్ష్యాన్ని తప్పుపడుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణనువాయిదా వేసింది.ఆ నివేదికపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆదేశిస్తూ, విచారణ అక్టోబర్ 18కి వాయిదా వేసింది.

### గ్రూప్ 1పై విచారణ 30కి వాయిదా

గ్రూప్-1పై విచారణను హైకోర్టు ఈ నెల 30కి వాయిదా వేసింది. పరీక్షకు మళ్లీ నోటిఫికేషన్ తిరిగి జారీ చేసే అధికారం టీఎస్‌పీఎస్సీకి (తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) లేదంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు షురూ అయ్యాయి. ప్రభుత్వ అనుమ తితోనే టీఎస్‌పీఎస్సీ చర్యలు చేపట్టాలని, నేరుగా చర్యలు తీసుకునే అధికారం లేదని పిటిష నర్లు వాదించారు. గత నోటిఫికేషన్ మేరకు నిర్వహించిన పరీక్షలో తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రిలిమ్స్ మాత్రమే



రద్దు చేసిన హైకోర్టు తిరిగి పరీక్ష నిర్వహిం చాలని చెప్పిందన్నారు. ఇందుకు విరుద్ధంగా టీఎస్‌పీఎస్సీ నోటి ఫికేషన్‌ను కూడా రద్దు చేసిందన్నారు. విచారణ ఈ నెల 30కి వాయిదా వేశారు.

పువ్వాడ పిటిషన్ కొట్టివేత: 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలప్పుడు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ మాజీ మంత్రి పువ్వాడ అజరు కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారనీ, మద్యం, క్రికెట్ కిట్‌లు పంపిణీ చేస్తున్నారని నాటి ఎన్నికల అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖమ్మం జిల్లా ఖానాపురం హవేలి పీఎస్‌లో కేసు నమోదైంది. దీనిని రద్దు చేయాలన్న పువ్వాడ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

# రాజీమార్గమే ఉత్తమ మార్గం

### లోక్ అదాలత్ లో 176 కేసులు పరిష్కారం

ఆత్మకూరు, సెప్టెంబర్ 28 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి లోక్ అదాలత్ లో మొత్తం 176 కేసులు పరిష్కరించబడినట్లు కోర్ట్ అదాలత్ సిబ్బంది తెలిపారు. వాటిలో క్రిమినల్ 24,సివిల్ 02,అడ్మిషన్లు 147,బ్యాంకు పి ఎల్ సి లు 04, మొత్తం 176 కేసులు పరిష్కరించబడ్డాయి. వీటిలో క్రిమినల్ సివిల్ అడ్మిషన్ల కేసుల నందు 3,01,000 బ్యాంకు పి ఎల్ సి ల ద్వారా 9,05,000 రూపాయలుగా లోక్ అదాలత్ సిబ్బంది రాణి తెలిపారు. న్యాయవాదులు దివాన్ జి అశోక్ కుమార్,టి.రామేశ్వర్ రెడ్డి తిప్పారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, శంకర్ లింగం, జీకే రాములు, ముక్తేశ్వర్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.



# రెండు ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాల బస్సులు ఢీ

- ఓ బస్సు డ్రైవర్ మృతి
- మరో బస్సు డ్రైవర్, 15 మంది విద్యార్థులకు గాయాలు

నర్సాపూర్: మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢకొనడంతో ఒక బస్సు డ్రైవర్ మృతి చెందాడు. మరో బస్సు డ్రైవర్‌తో పాటు 15 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన శు క్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఓ బస్సు విద్యార్థులను తీసుకొని హైదరాబాద్ నుంచి కళాశాలకు వెళుతున్న క్రమంలో అదే కళాశాలకు చెందిన మరో బస్సు కళాశాల నుంచి నర్సాపూర్ పట్టణానికి వస్తున్నది. ఈ క్రమంలో మార్గమధ్యలోకి రాగానే నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారిలో గల ఆనంద్ గార్డెన్ సమీపంలో కళాశాల వైపు వెళ్లే బస్సు డ్రైవర్ ఓ ఆటోను తప్పించబోయాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఖాళీ బస్సును ఢ కొట్టాడు. ఈ ప్రమాదంలో బీరంగూడకు చెందిన నాగరాజు (50) అనే బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా ఆస్పత్రి సమీపంలో మృతి చెందాడు. కొల్చారం గ్రామానికి చెందిన మరో డ్రైవర్ యాదగిరి బస్సు స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయి




కాళ్లకు తీవ్ర గాయాల య్యాయి. వీరితోపాటు బస్సులో కళాశాలకు వస్తున్న 15మంది విద్యార్థులకు గాయాల య్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఎమ్మెన్నార్ ఆస్పత్రికి తరలించారు. సీఐ జాన్ రెడ్డి, ఎస్ఐ లింగం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా, ఈ ప్రమాదంతో నర్సాపూర్- సంగారెడ్డి ప్రధాన రోడ్డు గుండా వెళ్లే భారీ వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులకు దాదాపు రెండు గంటల సమయం పట్టింది.

# ‘వండర్‌లా’లో రెండు కొత్త రైడ్‌లు

- ప్రారంభించిన సినీనటుడు నాగచైతన్య

హైదరాబాద్: ప్రముఖ అమ్యూజింగ్ పార్కు వండర్‌లా హైదరాబాద్‌లో రెండు కొత్త రైడ్‌లను ఏర్పాటు చేసింది. వీటిని శుక్రవారం సినీ హీరో నాగచైతన్య లాంఛనంగా ప్రారంభించారు. అత్యాధునిక సాంకేతికతో హైపర్‌వర్స్, జి-ఫాల్ రైడ్‌లను అదనంగా జోడించామని వండర్‌లా హాలిడేస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కె చిట్టిలపిల్లి తెలిపారు. హైదరాబాద్‌లో ఇలాంటి అమ్యూజింగ్ పార్కు ఉండటం సంతోషకరమని..

తనకు బాగా నచ్చిందని నాగ చైతన్య అన్నారు. "జి-ఫాల్, ఒక ఎత్తైన ఫ్రీ-ఫాల్ రైడ్, 40 మీటర్ల ఎత్తులో ఉంటుంది. గుండ్రంగా చుట్టూ కూర్చున్న 12 మంది రైడర్‌లతో, ఇది ఉద్విగమైన రీతిలో, అధిక థ్రిల్ పంచుతూ పడిపోతున్నట్టుగా ఉండి.. అడ్రినలిన్ ప్రేమికులకు సరికొత్త అనుభూతిని అందిస్తుంది. హైపర్‌వర్స్ అత్యాధునిక మెటావర్స్ 3డి థియేటర్ అనుభవాన్ని అందిస్తుంది. 8కె హై-రిజల్యూషన్ డిస్‌ప్లే, 360 డిగ్రీస్ సరౌండ్ సౌండ్, 270



డిగ్రీస్ లైట్, షాడో డిజైన్‌ను కలిగి ఉండి ఎగిరే దృశ్యాలలోకి అతిథులను తీసుకుని వెళ్తుంది." అని అరుణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ధీరన్ చౌదరి, హైదరాబాద్ పార్కు హెడ్ మధుసుధన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ రుణమాఫీ చేయాలి

హైదరాబాద్: తెలంగాణ భవన్ అలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పని తీరు ఎలా ఉందంటే ఎన్నికలపుడు గాల్లో మాటలు ,అధికారం లో గాలి మోటార్ల యాత్రలు అన్నట్టు ఉంది. శ్రీశైలం నిర్వాసితుల సమస్యను ఈ ప్రభుత్వం పరిష్కరించడం లేదు. తత ప్రభుత్వాలు శ్రీశైలం నిర్వాసితులకు అన్యాయం చేశాయని ఎన్నికలప్పుడు రేవంత్ రెడ్డి ఆరోపించారు. శ్రీశైలం నిర్వాసితుల్లో 78 మంది కి కేసీఆర్ ప్రభుత్వం లష్కర్లుగా శాశ్వత ఉద్యోగాలు ఇచ్చింది. కేసీఆర్ హాయం లో ఆరువేల లష్కర్ ఉద్యోగాలు నింపాలనుకుని అందులో శ్రీశైలం నిర్వాసితులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతిపాదించారు. ఇందుకోసం జీవో కూడా ఇచ్చారు. వంత్ ఎన్నికలప్పుడు హామీ ఇచ్చినా అది నెరవేరడం లేదని అన్నారు.

పాలమూరు జిల్లాకు మంత్రులు గాలి మోటర్లలో వచ్చి గాలి మాటలు చెప్పి వెళ్లారు. వెంటనే శ్రీశైలం నిర్వాసితుల సమస్యను పరిష్కరించాలి. ఈ ప్రభుత్వానికి హానీమూన్ పీరియడ్ అయిపోయింది. ప్రభుత్వ ఆస్పత్రులు అధ్వాన్నంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా మంత్రులు తమ సొంత పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. హైదరాబాద్ నుంచి నల్లగొండ తిరుగుతున్నారు తప్ప ఏ సమస్యలు పట్టించుకొవడం లేదు. మిషన్ భగీరథ పై మంత్రి కోమటి రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారు. షన్ భగీరథ తో నల్లగొండ జిల్లా లో ఫ్లోరోసిస్ దూరమైందని పార్లమెంట్ లో కేంద్రం సమాధానం ఇచ్చింది. అపుడు కోమటి రెడ్డి ఎంపీ గా ఉన్నారు. ఫ్లోరోసిస్ భూతం ఉందని కల్లిబొల్లి మాటలు చెబుతున్నారు. .కేసీఆర్ యే ఫ్లోరోసిస్ భూతాన్ని తరిమి కొట్టారు. నెల్లికల్ లిఫ్ట్ పై ప్రజలకు కోమటి రెడ్డి స్పష్టత ఇవ్వాలి. జానా రెడ్డి 6 వేల ఎకరాలకు నీళ్లు ఇస్తాం అంటున్నారు. 24 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని కేసీఆర్ ప్రతిపాదించారు .దాన్ని అమలు చేయాలి. అమృత్ స్కాం పై కే టీ ఆర్ పూర్తి ఆధారాలతోనే మాట్లాడారు. రేవంత్ రెడ్డి దగ్గర కాంట్రాక్టులు దక్కించుకునేందుకే కోమటి రెడ్డి కే టీ ఆర్ పై అనవసర విమర్శలు చేస్తున్నారు. బీ ఆర్ ఎస్ నుంచి మరికొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతారని కోమటి రెడ్డి అంటున్నారు. రేవంత్ రెడ్డి చేస్తున్న పాడు పనులు చూసి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతారా ? .ఇంకా నాలుగేళ్ళు రేవంత్ పాలనను ఎలా భరించాలి అని ప్రజలు అనుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో ఎందుకు చేరుతారు ?

వానా కాలం సీజన్ కు ఇంకా ఐదు రోజులే టైం ఉంది ..రైతు బంధు ఎప్పుడిస్తారు ? కాళేశ్వరం ప్రాజెక్టు లో జైల్లో వేయాల్సి వస్తే ఇంజినీర్లు మిగలరని రేవంత్ అనడం ప్రభుత్వ ఉద్యోగులను అవమానపరచడమేనని అన్నారు.

కాళేశ్వరం పై కాంగ్రెస్ నేతలు అబద్దాలు మాట్లాడుతున్నారు. మూసి కి మల్లన్న సాగర్ నీళ్లు తెస్తామని సీఎం అంటున్నారు . కాళేశ్వరం లేక పోతే మల్లన్న సాగర్ ఎక్కడిది. .కాళేశ్వరం పై నిజాలతో కూడిన బుక్ లెట్ ను కాంగ్రెస్ నేతలకు పోస్టు లో పంపిస్తామని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్ మాట్లాడుతూ గ్యారంటీల పై గాలి మాటలు చెప్పి కాంగ్రెస్ నేతలు తప్పించుకుంటున్నారు. కేసీఆర్ పై విమర్శలు తప్ప రేవంత్ రెడ్డి సాధించిందేమీ లేదు. గ్రామాల్లో కాంగ్రెస్ హామీల పై ప్రజలు నిలదీస్తున్నారు. ముందు వాటిపై రేవంత్ దృష్టి పెట్టాలి. .గ్రామాల్లో పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల బిల్లులు కూడా ఇవ్వడం లేదు. పారిశుద్యం పడకేసింది. రైతు రుణ మాఫీ కాక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. సంపూర్ణ రుణ మాఫీ అమలు చేయాలని అన్నారు

# భారత్‌కు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వంకై యూకే మద్దతు

న్యూ డిల్లీ: ప్రపంచ శాంతి స్థాపనే లక్ష్యంగా ఏర్పాటైన ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ దిశగా ప్రధాని మోదీ ప్రపంచ దేశాల మద్దతు కూడగడుతున్నారు. భారత్ ప్రయత్నాలకు అంతర్జాతీయంగా మద్దతు లభిస్తోంది.ఇప్పటికే పలు దేశాలు భారత్ కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం మద్దతు ప్రకటించాయి. తాజాగా ఈ జాబితాలోకి యూకే కూడా వచ్చి చేరింది. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌లో బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ మాట్లాడుతూ.. యూఎన్ఎస్‌సీలో మరిన్ని దేశాలు ప్రాతినిధ్యం వహించాలని పేర్కొన్నారు. 'భద్రతా మండలిలో తగినన్ని సభ్యదేశాలు లేనంతవరకూ ప్రతిపక్ష ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు సాగడం కష్టం. కాబట్టి భద్రతామండలిని మరింత పటిష్ఠం చేయాలి. ఇందులో భాగంగానే శాశ్వత సభ్యత్వ దేశాల సంఖ్యను పెంచాలి. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలుగా భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీ ఉండాలని కోరుకుంటున్నాం. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి' అని అన్నారు. అంతకుముందు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రన్ స్పందించిన విషయం తెలిసిందే. జనరల్ అసెంబ్లీలో మెక్రాన్ ప్రసంగిస్తూ.. యూఎన్ఎస్‌సీ విధానాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని మెక్రాన్ అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిలో భారత్‌కు మద్దతు ప్రకటించారు. యూఎన్ఎస్‌సీ సమర్థతను పునరుద్ధరించడానికి ఈ మార్పులు తగినవి అని పేర్కొన్నారు. ఇక గత వారం ఐరాస భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి అమెరికా కూడా మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక అమెరికన్ టైకూన్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సైతం గతంలోనే భారత్‌కు మద్దతు ప్రకటించారు.కాగా, భద్రతా మండలిలో భారత్‌కు సాధారణ సభ్యత్వం మాత్రమే ఉంది. భద్రతా మండలిలో ప్రస్తుతం చైనా, అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యా దేశాలు శాశ్వత సభ్య దేశాలుగా కొనసాగుతున్నాయి. ఈ ఐదు దేశాలకు ప్రత్యేకంగా వీటో పవర్ ఉంటుంది. మండలి సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను ఈ ఐదు దేశాల్లో ఏ ఒక్క దేశం అభ్యంతరం వ్యక్తం చేసినా సరే ఆ నిర్ణయం వీగిపోతుంది. శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఐదింటిలో నాలుగు మద్దతు ఇస్తున్నా.. చైనా మాత్రం భారత్ ప్రయత్నాలకు అడ్డుపడుతోంది.

# కనీస వేతనం 20 వేల నుంచి 26 వరకు

హైదరాబాద్: అనధికారిక రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాలను పెంచింది. నైపుణ్యం లేని కార్మికుల కనీస వేతనం రూ.783కి పెంచారు. వారానికి ఒక సెలవును పరిగణనలోకి తీసుకుంటే, నెలకు కనీస వేతనం రూ.20,358 అవుతుంది. సెమీ స్కిల్డ్ కార్మికుల కనీస రోజువారీ వేతనం రూ.868కి పెంచారు. అత్యంత నైపుణ్యం కలిగిన కార్మికులకు రోజువారి వేతనం రూ.1,035కు పెంచారు. మొత్తం కనీస రోజువారీ వేతనం నెలకు రూ.20,358 నుంచి రూ.26,910 వరకు ఉంటుంది. అక్టోబర్ 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఎ గ్రేడ్ ఏరియాల్లో పనిచేసే వారికి ఇది రేట్ రివిజన్.కనీస రోజువారీ వేతనం కూడా సంవత్సరానికి రెండుసార్లు కనీస వేతనం రూపంలో సవరించబడుతుంది. కొత్త రేట్లు ఏప్రిల్ 1, అక్టోబర్ 1 న ప్రకటిస్తుంది. పారిశ్రామిక కార్మిక ద్రవ్యోల్బణం ఆరు నెలల సగటు ఆధారంగా కార్మికుల కనీస వేతనాలు పెరుగుతాయి.ఆరు నెలల్లో వినియోగదారుల ధరల సూచీ (ద్రవ్యోల్బణం) శాతం. 2.40 శాతం పెరిగింది. ఈ ధరల పెరుగుదల కారణంగా జీవన వ్యయం కూడా పెరిగింది. దీన్ని భర్తీ చేసేందుకు కార్మికులకు వేరియబుల్ డీఏను పెంచారు.

అసంఘటిత రంగాలు: నిర్మాణం, మైనింగ్, వ్యవసాయం మొదలైనవి.

నైపుణ్యం లేని ఉద్యోగాలు: నిర్మాణ కార్మికులు, చెత్త స్వీపర్లు, క్లీనర్లు, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు.

సెమీ-స్కిల్డ్ ఉద్యోగాలు: ట్రక్ డ్రైవర్, హోటల్ సర్వర్, ఫైల్ క్లర్క్ మొదలైనవి.

నైపుణ్యం కలిగిన ఉద్యోగాలు: ఎలక్ట్రికల్, ప్లంబర్లు, మెషిన్ ఆపరేటర్, క్రేన్ ఆపరేటర్ మొదలైనవి.

# డాక్యుమెంట్ రైటర్లతో సబ్ రిజిస్ట్రార్ల కుమ్మక్కు

### చిన్న చిన్న కారణాలు చూపి దండిగా వసూళ్లు

### వేలల్లో నాకు వందల్లో మీకు అంటూ సబ్ రిజిస్టర్ల వ్యవహారం

### పట్టించుకోని రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు




వరంగల్: గింజోటి నాటితే మొక్కోటి మొలుస్తదా" అన్న చందంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్టర్ల పరిస్థితి తయారయిందని జిల్లా ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు... ఇక్కడి వాళ్ళు అక్కడికి అక్కడి వాళ్ళు ఇక్కడికి మారినంత మాత్రాన అవినీతి పనులు జరగకుండా పోతాయా అన్న అపోహలను నిజం చేస్తూ సబ్ రిజిస్టర్ల వ్యవహారం కొనసాగుతుందని ప్రజలు వింతగా చర్చించుకుంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో పారదర్శకమైన విధంగా ప్రజలకు సేవలు అందించాలన్న ఉద్దేశంతో చేపట్టిన బదిలీల ప్రక్రియ క్షేత్రస్థాయిలో అబాసు పాలవుతుందన్న విమర్శలు జిల్లాలో జోరుగా వినిపిస్తున్నాయి. జూలై చివరి వారంలో తెలంగాణ వ్యాప్తంగా స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల ప్రక్రియ జరిగింది.అ బదిలిల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాలో పనిచేసిన సబ్ రిజిస్టర్లను ప్రభుత్వం ఖమ్మం తోపాటు ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. అక్కడివారిని వరంగల్ ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు బదిలీపై తెచ్చిన ఫలితం ఏమీ లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇతర జిల్లాల నుండి వచ్చి వరంగల్ జిల్లాలో సబ్ రిజిస్టర్ గా పనిచేస్తున్న అధికారులు డాక్యుమెంట్ రైటర్లతో కుమ్మక్కై పనిచేస్తున్నట్లు సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. నేరుగా సబ్ రిజిస్టర్లు డాక్యుమెంట్ రైటర్ ను పిలిపించి తనకు వేళల్లో మామూలు ఇచ్చి వందల్లో తీసుకోవాలని చర్చించడం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. సబ్ రిజిస్టర్ వ్యవహారంతో ఇటు కార్యాలయ సిబ్బంది డాక్యుమెంట్ రైటర్లు ఏం చేయాలో పరిస్థితులు ఉన్నాయని తలలు పట్టుకుంటున్నారు.ఇతర జిల్లాల నుండి వరంగల్ జిల్లాలో విధులను నిర్వహిస్తున్నామన్న జ్యాసే లేకుండా సబ్ రిజిస్టర్లు అవినీతి పనులకు తెగబడుటంతో ప్రజలు విస్తుపోతున్న పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు .కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారి పట్ల సబ్ రిజిస్టర్లు చిన్న చిన్న కారణాలు చూసి వేలల్లో మామూళ్ల డిమాండ్ చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. సబ్ రిజిస్టర్లు అవినీతికి తెగబడటంతో వాటికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని వివిధ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈ తతంగం జరుగుతున్న స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు చోద్యంగా వ్యవహరించడంపై ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతుంది.కార్యాలయంలో జరుగుతున్న అవినీతి పనులపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకోన్నట్లయితే వారు చేసే పనుల్లో ఉన్నతాధికారులకు వాటా ఉంటుందన్న అపోహలు నిజం కావచ్చునున్న అనుమానాలకు బలం చేకూరినట్టు అవుతుందని ప్రజలు అనుకుంటున్నారు.

# రైతుల శ్రేయస్సుకు కలిసికట్టుగా పని చేద్దాం..!

### సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు

కమాన్ పూర్: రైతుల శ్రేయస్సు కొరకు కలిసికట్టుగా పని చేద్దామని కమాన్ పూర్ వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు అన్నారు.కమాన్ పూర్ మండల కేంద్రంలోని పీ. ఏ. సీ. ఎస్ కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై సమీక్ష జరిపారు. అనంతరం పీ. ఏ. సీ. ఎస్ లో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఇందులో 560 మంది రైతులకు రుణమాఫీ రూ, 3కోట్ల 95 లక్షల 45 వేల 81 లు జరిగిందన్నారు. అలాగే రుణమాఫీయైన 468 మంది రైతులకు రూ, 3 కోట్ల 62 లక్షల 71 వేల రూపాయలు రుణం ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే కొత్తగా 103 మంది రైతులకు రూ, 80 లక్షల 59 వేల రుణం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే దీర్ఘకాలిక రుణాలు రూ, 51,40,000 ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే ఫెర్టిలైజర్ 5976 బస్తాలు యూరియా డి.ఎ.పి 17 లక్షల 805 అమ్మడం జరిగిందని స్పష్టం చేశారు. వేసంగిలో 1,39,820 క్వింటాల్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ



సహకార సంఘం కార్యదర్శి తిమ్మరాజు సంతోష్ కుమార్, వైస్ చైర్మన్ చిందం తిరుపతి, డైరెక్టర్లు వైనాల రాజు, గుండేటి శ్రీ మూర్తి, వరాల నర్సింగం, ఈదిరి నరేష్, అదవాల చంద్రయ్య, బానోతులక్ష్మి, సిబ్బంది రేగుల కుమార్, ఎస్ కే సాబీర్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.


# స్వచ్ఛత అందరి బాధ్యత

### ఆర్.జి-3, జి.ఎం

కమాన్ పూర్: కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ వారి ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో అక్టోబర్ 02 నుండి 31 వరకు స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0 ను సింగరేణి వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన కార్యక్రమ విదివిధానాల పై గురువారం జి.ఎం కార్యలయం నందు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు సంభందిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుభ్రపరచ వలసిన కార్యాలయాలు, వాటి సుందరీకరణ, చెత్తను గుర్తించి పడవేయడం, సరియైన పద్ధతులలో రికార్డులను బద్రపరచడం, తదితర అంశాల పై కార్యక్రమం నిర్వచించడం జరుగు తుందని, స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ కార్యక్రమములో సెప్టెంబర్ 16 నుండి 30 సెప్టెంబర్ తేదీ వరకు అవసరమైన క్లీనింగ్ చేసి బద్రపర్చవలసిన పని స్థలాలను, ఆఫీస్ ఫైల్స్ గుర్తించడం, 02 అక్టోబర్ నుండి 31 అక్టోబర్ తేది వరకు గుర్తించబడిన టార్గెట్ లను పూర్తి చేయడం, క్లీనింగ్ ముందు మరియు తరువాత పోటోలను తీయడం వాటి రికార్డ్స్ బద్రపరచాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని పలు సలహాలు,సూచించనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఎజిఎం పి.శ్రీనివాసులు, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, ప్రాజెక్ట్ అధికారి సీహెచ్.వెంకటరమణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, సివిల్ విభాగాధిపతి రాజేంద్ర ప్రసాద్, ఎస్టేట్స్ అధికారి కె.ఐలయ్య, అటవి విభాగాధిపతి బి.కళ్యాణ్, ఐటి అధికారిని ఆర్. రాజేశ్వరి తో పాటు ఇతర విభాగాల అధిపతులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ పొందిన అభ్యర్థులకు పోస్టింగ్ ఉత్తర్వుల అందజేత



కమాన్ పూర్: సింగరేణి సంస్థ రామగిరి కాలనీ పరిధిలోని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని ఎం.వి.టి.సి. లో 48 రోజుల శిక్షణ పూర్తయిన 27 మంది డిపెండెంట్లకు జి.ఎం. కార్యాలయంనందు నిర్వహించిన కార్యక్రమం లో అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు పోస్టింగ్ ఉత్తర్వులను అందజేశారు.ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి ఉద్యోగంలో చేరుతున్నారని, అయితే ఆ స్థాయికి తగ్గట్టుగా పని చేస్తూ, అధికారులు, సూపర్వైజర్ల ఆదేశాలను పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, భద్రతతో విధులు నిర్వహిస్తూ మీకు ఈ ఉద్యోగం చేయడానికి అవకాశం కల్పించిన మీ తల్లిదండ్రు లకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. చెడు అలవాట్ల కు బానిస కావొద్దని అన్నారు. విధులకు క్రమం తప్పకుండా హాజరవు తూ, సీనియర్ ఉద్యోగుల దగ్గర క్రమశిక్షణతో పని నేర్చుకొని, కలిసి కట్టుగా పనిచేసి మున్ముందు మంచి పదోన్నతులు సాధించి కుటుంబం తో పాటు సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాతినిధ్య సంఘ ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఎస్వోటుజిఎం బి.సత్యనారాయణ, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ గుర్రం శ్రీహరి, ఎంవిటిసి మేనేజర్ మల్లన్న, సీనియర్ పి.ఓ పి.రాజేశం, జూనియర్ అసిస్టెంట్ క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరసనలు, ఆందోళనల నడుమ సర్వే!

- రెండో రోజూ కొనసాగిన మూసీ మార్కింగ్ ప్రక్రియ
-'డబుల్' ఇండ్లు వద్దంటూ పలు ప్రాంతాల్లో మూసీ నివాసితుల ఆందోళన బాట
- అధికారులతో వాగ్వాదం.. వెనుదిరిగిన అధికారులు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు.. ప్లకార్డుల ప్రదర్శనలు
- 'డబుల్' ఇండ్లకు వెళ్లేవారి పిల్లలను స్కూల్లో చేర్పించేందుకు అధికారుల చర్యలు
- మూసీ నివాసితుల ముసుగులో పార్టీల 'రాజకీయం'

సిటీ: మూసీ సుందరీకరణలో భాగంగా మూసీ రివర్ బెడ్ ప్రాంతంలో ఉన్న ఇండ్లకు రెడ్‌మార్క్ వేస్తున్న ప్రక్రియ రెండో రోజూ ఉద్రిక్తతల నడుమ సాగింది. కొన్నిచోట్ల కొంత అంతరాయం, ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినా అధికారులు మాత్రం వారి పని వారు చేసుకుంటూ ముందుకు వెళ్లారు. దాంతో నిర్వాసితులు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన బాట పట్టారు. 'ఎంతో కష్టపడి కట్టుకున్న ఇండ్లు వదిలి.. డబుల్ ఇండ్లకు ఎట్లా పోవలే' అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే చేయడానికి వచ్చిన అధికారులతో వాగ్వాదానికి దిగి.. మార్కింగ్ ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. చైతన్యపురి పరిధిలోని వినాయక్‌నగర్, సత్యనగర్, వెంకటసాయి నగర్, మారుతీ నగర్, ఫణిగిరి నగర్ తదితర ప్రాంతాల్లో మార్కింగ్ చేసేందుకు వచ్చిన అదికారులను అడ్డుకున్నారు. నివాసితులకు, రాజకీయ నాయకులు తోడవడంతో ఆందోళన మరింత ఉద్రిక్తతలకు దారి తీసింది. రాజేంద్రనగర్ మండలంలో రివర్ బెడ్‌లో అధికారులు ఐడెంటిఫికేషన్ మార్క్ వేయడానికి రాగా.. రివర్ బెడ్, బఫర్ జోన్‌లో ఉన్నవారు ఆందోళనలు చేశారు. దాంతో పోలీసు బందోబస్తు మధ్య ఇండ్లకు స్టాంప్‌లు వేశారు. నాంపల్లి మండల పరిధిలో ఇమ్లీబన్ బస్టాండ్ నుంచి చాదర్‌ఘాట్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో అధికారులు మార్కింగ్ ప్రక్రియ నిర్వహించారు. అయితే, పురానాపూల్ దర్వాజా, కాశీబుగ్గ టెంపుల్ వద్ద మూసీ నివాసితులు అందోళనలకు దిగారు. అధికారులు సముదాయించినా రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. జియాగూడ పరిధిలోని మూసీ రివర్ బెడ్‌లో మార్కింగ్ చేస్తుండగా సుమారు వంద మందికిపైగా బాధితులు పటేల్ హౌటల్ వద్ద ఆందోళన చేపట్టారు. దాంతో



అక్కడ కొంత ఉద్రిక్తత నెలకొనగా.. పోలీసులు వచ్చి ఆందోళనకారులకు సర్ధిచెప్పారు.

### ప్రభుత్వ ఖర్చులతోనే తరలింపు

సిటీలోని పలు ప్రాంతాల్లో నిరసనలు, ఆందోళనలు జరుగుతుంటే.. ఇంకోవైపు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నవారిని అధికారులు ప్రభుత్వ ఖర్చులతో తరలిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్ జిల్లాలో మరో 14 కుటుంబాలను తరలించారు. రాజేంద్రనగర్ పరిధిలో మరో 4 కుటుంబాలను అధికారులు డబుల్ ఇండ్లకు తరలించారు. కాగా, వనస్థలిపురంలో 97, ప్రతాపసింగారంలో 40, తిమ్మాయిగూడలో వంద డబుల్ ఇండ్లు ఖాళీగా ఉన్నాయని, మూసీ నివాసితులు తాము కోరుకున్న చోట ఇండ్లు ఇస్తామని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి తెలిపారు.

# బీఆర్ఎస్ లో ఏం జరుగుతోంది..?

కరీంనగర్: అధికారం కోల్పోయిన తర్వాత ప్రజలతో పనేం ఉన్నాదన్నట్లు ప్రధానమైన నేతలు అంతా సైలెంట్ అయిపోయారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు తప్పించి మిగిలిన నేతలు భూతద్దం పెట్టి వెదికినా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదట.. అధినేత కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ నేతలు బయటకి ఎందుకు రావడం లేదు.తెలంగాణలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ నేతలకు ఏ పనిలేకుండా పోయిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాన్ని అనుక్షణం కనిపెడుతూ ప్రజలకు రక్షణగా నిలవాల్సిన బీఆర్ఎస్ నేతలు ఆ పనిచేయడం లేదన్న విమర్శలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. అధికారం గల్లంతై 9 నెలలు అవుతున్నా? నూటికి 90 శాతం మంది బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో కనిపించడం లేదనే వ్యాఖ్యలే వినిపిస్తున్నాయి.ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్‌రావు పర్యటనల్లో హడావుడి చేస్తున్న నేతలు ఆ తర్వాత క్యాడర్‌కు అందుబాటులో ఉండటం లేదని చెబుతున్నారు. ముఖ్యంగా పార్టీని నడిపే విషయంలో హైకమాండ్ నుంచి ఎలాంటి దిశానిర్దేశం లేకపోవడంతోనే బీఆర్ఎస్ నేతలు ఇలా ఇళ్లకే పరిమితమవుతున్నారనే టాక్ కూడా వినిపిస్తోంది?.బీఆర్ఎస్? టీఆర్ఎస్‌గా ఉన్న సమయం నుంచి నేతలకు చేతినిండా పనిఉండేది. అధినేత కేసీఆర్ పార్టీ స్థాపించిన సమయంలో ఉద్యమించి రాష్ట్రం మొత్తం కదం తొక్కిన గులాబీ శ్రేణులు? 2014లో తొలిసారి అధికారంలోకి వచ్చిన నుంచి 2018 వరకు దాదాపు పదేళ్లు బిజీబిజీగా ఉండేవారు. అధినేత కేసీఆర్ కూడా నేతలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో జిల్లాల్లో నిత్యం బీఆర్ఎస్ నేతల హడావుడి కనిపించేది. కానీ, అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌లో మునుపటి పోరాట పటిమ కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణలో హైకమాండ్‌కే స్పష్టమైన విధానం లేకపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి.రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రతిపక్ష స్థానంలో బీఆర్ఎస్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం లేదన్న విమర్శలు పార్లమెంట్ ఎన్నికల ముందు నుంచీ వినిపిస్తున్నాయి. ప్రధానంగా అధినేత కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమైపోవడం? సీనియర్ నేతలు ఎవరూ పార్టీ కార్యాలయం వైపు చూడటం కూడా మానేశారంటున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడే విషయంలో ఇంకో విపక్షం బీజేపీ నుంచి బీఆర్ఎస్ గట్టి సవాలే ఎదుర్కొంటోందని చెబుతున్నారప్రస్తుతం హైదరాబాద్‌లో హీట్ పుట్టిస్తున్న హైడ్రా విషయంలో బీఆర్ఎస్ వెనకబడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో కేటీఆర్, హరీశ్ రావు తప్ప మిగిలిన నేతలు ఎవరూ మాట్లాడటం లేదని అంటున్నారు. ఇక రైతు రుణమాఫీ, గ్యారెంటీల అమలు విషయంలోనూ కేటీఆర్, హరీశ్ రావు తప్ప మిగిలిన బీఆర్ఎస్ నేతలు మాటలు ఎక్కడా వినిపించడం లేదంటున్నారు. దీనివల్ల పార్టీ క్యాడర్‌లో అయోమయం కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఎన్నికల్లో ఓటమిపై చాలా నియోజకవర్గాల్లో ఇంతవరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదంటే బీఆర్ఎస్ పరిస్థితి ఏ విధంగా తయారైందో అర్థం చేసుకోవచ్చంటున్నారు పరిశీలకులు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా.. పోరాడితే పార్లమెంట్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు వచ్చేవని.. కానీ, అప్పుడు అస్త్రసన్యాసం చేసినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరించడం వల్ల చరిత్రలో లేనటువంటి ఓటమిని ఎదుర్కోవాల్సివచ్చిందని చెప్పుకుంటున్నారు.ఇక ఇప్పుడైనా తేరుకుని కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందాలంటే ఏం చేయాలనే అంశమై పార్టీలో చర్చ జరగాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఐతే పిల్లి మెడలో గంట కొట్టేదెవరు అన్నట్లు అధినేత కేసీఆర్ అడుగు తీసి బయట పెట్టకపోవడం.. పార్టీ పరంగా ఏ కార్యక్రమం చేస్తే ఏం జరుగుతుందోననే అయోమయం నేతలను వెనక్కి లాగుతుందంటున్నారు.ఇదే సమయంలో గతంలో ప్రోత్సహించిన వలసలు కూడా ఇప్పుడు పార్టీని ఇబ్బందికి గురిచేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. అవసరం ఉన్నా, లేకపోయినా గతంలో కాంగ్రెస్ నుంచి వలసలను ప్రోత్సహించడం.. ఎన్నికల ముందు వర్గ విభేదాలకు కారణమైందని.. ఇక అధికారం కోల్పోయిన తర్వాత సొంత పార్టీ వారితోపాటు వలస వచ్చిన నేతలు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరిపోవడంతో చాలాచోట్ల పార్టీ దెబ్బతిన్నాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పార్టీ బలోపేతానికి బీఆర్ఎస్ నాయకత్వం ఎలా ముందుకు వెళుతుందనేదే ఆసక్తికరంగా మారింది

# డీజేలు, టపాసుల కట్టడికి ప్రణాళిక

హైదరాబాద్: డీజేలు, టపాసుల వాడకంపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే గైడ్ లైన్స్ ను జారీ చేస్తామంటూ డీజీపీ జితేందర్ ఇప్పటికే ప్రకటించారు.డీజే వాడకం విషయంలో పలు జాగ్రతలు పాటించాలి. డీజే శబ్దాలపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. అవి అధిక శబ్ధం చేస్తుండడంతో ఇళ్లల్లో వయసుమీరిన వారు చాలా ఇబ్బందిపడుతున్నారు. డీజే శబ్దాల కారణంగా గుండె అదురుతుందని వారు ఆందోళన చెందుతున్నారు' అంటూ సీపీ పేర్కొన్నారు.అయితే, గణేష్ నిమజ్జనమే కాదు.. మిలాద్ ఉన్ నబీలో విపరీతంగా డీజేలు వాయిస్తూ డ్యాన్సులు చేశారు. పబ్ లో డ్యాన్సులు చేసిన విధంగా ర్యాలీల్లోనూ డ్యాన్సులు చేస్తున్నారు. ఈ క్రమంలో డీజే శబ్దాలను కట్టడి చేయాలని చాలా సంఘాల నుంచి వినతులు వస్తున్నాయి. డీజే శబ్ధాలను కంట్రోల్ చేయకపోతే ఆరోగ్యాలు దెబ్బతినే అవకాశం ఉంది. అందుకే వివిధ వర్గాలను పిలిచి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశాం. ఈ విషయంలో మీ అందరి అభిప్రాయాన్ని తీసుకుని ప్రభుత్వానికి అందజేస్తాం. ఆ తరువాత దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది' అంటూ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.కాగా, ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే రాజాసింగ్ తోపాటు పలువురు ఎంఐఎం ఎమ్మెల్యేలు, సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ పోలీస్ అధికారులతోపాటు పలు పార్టీల ప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే.. వినాయక చవితితోపాటు పలు పండుగల వేళ నగరంలో డీజే శబ్దాల మోత మోగింది. ఆ వారం రోజులపాటు డీజే శబ్దాలు, డ్యాన్సులతో మార్మోగింది. మరో విషయమేమంటే.. డీజేల కారణంగా చోటు చేసుకున్న ప్రమాదాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో అప్పుడప్పుడు వైరల్ అవుతుంటాయి. డీజేల వద్ద డ్యాన్సులు చేస్తూ మృతిచెందిన దృశ్యాలు ఆ వీడియోల్లో కనిపిస్తుంటాయి. ఓ వైపు డీజేల శబ్ధం, మరో వైపు వాటి వల్ల కలుగుతున్న డిస్టపెన్స్ పై పోలీసులకు భారీగా ఫిర్యాదులు వస్తున్న క్రమంలో పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. వాటిని కట్టడి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.ఆపేల విషయంలోనూ నిబంధనల ఉల్లంఘన జరుగుతోంది. నివాస ప్రాంతాల్లో పగలు 55 డెసిబెల్స్, రాత్రి 45 డెసిబెల్స్‌కి సౌండ్ మించకూడదు.. కమర్షియల్ ఏరియాల్లో పగలు 65 డెసిబెల్స్, రాత్రి 55 డెసిబెల్స్ వరకే సౌండ్‌కి పరిమితి ఉంటుంది. పారిశ్రామిక ప్రాంతాల్లో పగలు 75 డెసిబెల్స్, రాత్రి 70 డెసిబెల్స్‌కి లిమిట్ చేస్తూ నిబంధనలున్నాయి. ఇక స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రుల ఉన్న ప్లేస్‌లైతే పూర్తిగా సైలెంట్ జోన్స్. కానీ వీటిని పట్టించుకోకుండా ఆపేలు హోరెత్తుతున్నాయి. అందుకే వీటిని కంట్రోల్ చేయడం ఎలాగనే దానిపై రౌండ్ టేబుల్ మీటింగ్‌లో చర్చించారు. వివిధ వర్గాల అభిప్రాయలను సేకరించిన హైదరాబాద్ పోలీసులు పూర్తి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తారు

# మండుతున్న నిత్యావసరాల ధరలు

హైదరాబాద్: పచారీ సామాన్లకో, కాయగూరలకో సంచి పట్టుకుని బైటికెళితే.. గుండెలు బరువెక్కకుండా ఇంటికొస్తామన్న గ్యారంటీ లేకుండా పోతోంది. ఔను మరి.. కొండెక్కి చుక్కలనంటుకున్నాయి నిత్యావసరాల ధరలు. వంట నూనెలు భగ్గుమంటుంటే.. కూరగాయల ధరలు కొత్త రికార్డులు క్రియేట్ చేస్తున్నాయి. కొత్తిమీర కొనాలన్నా యాభైనోటు బైటికి తియ్యాల్సిన పరిస్థితి. పండగ సీజన్లో మిడిల్‌క్లాసోడ్ని భయపెట్టి చంపేస్తున్నాయి తాజా ధరలు.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడం, దిగుబడి తగ్గిపోవడం, రవాణా సమస్యలు.. అన్నీ కలిపి కూరగాయల ధరల్ని కొండెక్కేలా చేశాయి. బహిరంగ మార్కెట్లే కాదు.. రైతుబజార్లలో కూడా ఏది కొనబోయినా కొరివే. సరిగ్గా నెలరోజుల కిందట కిలో పాతిక రూపాయలకొచ్చిన టమోటా ఇప్పుడు రెండింతలై హాఫ్ సెంచరీ పలుకుతోంది. 50 నుంచి 70 రూపాయలు ఇచ్చుకుంటే తప్ప కిలో కూరగాయలు రావడం లేదు. దానికి తోడు వెల్లుల్లి, ఉల్లి ధరలు సైతం కొన్నవాళ్లకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.మార్కెట్లో వంట నూనెలు సైతం భగ్గుమంటున్నాయి. పామాయిల్, సన్ ఫ్లవర్ నూనెలు లీటర్‌కు 20 రూపాయలకు పైగా పెరిగింది. వేరుశనగ నూనె 160 రూపాయలు దాటి.. డబుల్ సెంచరీని టచ్ చెయ్యబోతోంది. కొబ్బరి నూనెదీ అదే దారి. వంట నూనెలపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాలు భారీగా పెంచడమే ఈ మంటకు కారణమట. బుక్కయ్యేది మాత్రం వినియోగదారుడే.ఆకుకూరలైతే ముట్టుకుంటే చాలు అగ్గి రాజుకుంటోంది. మార్కెట్లో ఇతర కూరగాయలతో పోలిస్తే ఆకుకూరల రేట్లు కాసింత కనికరిస్తాయి. అందరికీ అందుబాటులో ఉంటాయి. 20 రూపాయలకు ఆరు కట్టల పాలకూరొచ్చేది. పదిరూపాయలిస్తే రెండుమూడు కొత్తిమీర, పుదీనా కట్టలొచ్చేవి. ఇప్పుడైతే. వందనోటిస్తే తప్ప వచ్చేదే లే అంటోంది కొత్తిమీర.రెండు వందనోట్లు పట్టుకెళితే కనీసం నాలుగైదు రకాల కూరగాయలతో చేతిలో సంచి నిండేది. ఇప్పుడైతే వెజిటబుల్ బడ్జెట్ కూడా ఐదొందలు దాటిపోతోంది. సాధారణంగా కార్తీక మాసంలో కూరగాయల ధరలు పెరుగుతాయి. ఖరీఫ్ సీజన్ పూర్తయ్యి రబీ పంట మొదలయ్యే లోపు కూరగాయలు ధరలు పెరగడం కామన్. కానీ.. కూరగాయలే కాదు.. నూనె ప్యాకెట్లు కూడా భగ్గుమంటుంటే.. సగటు వినియోగదారుడి గుండె గుభేల్‌మంటోంది.

# 500 కోట్ల పెరుగుదలపై విజిలెన్స్ గురి

హైదరాబాద్: తెలంగాణ సెక్రటేరియేట్ నిర్మాణానికి ఖర్చు ఎంత? అంచనాలను అప్పటి ప్రభుత్వం అమాంతంగా పెంచేసిందా? నిర్మాణానికి 1000 కోట్లు దాటేసిందా? ఐటీ సామాగ్రికి సైతం అదనంగా ఖర్చు చేసిందా? ఆ ఖర్చుని చూసి అధికారులు నోరెళ్లబెట్టారా? తాజాగా అందుకున్న సమాచారం మేరకు విజిలెన్స్ విచారణ జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.బీఆర్ఎస్ పార్టీకి కష్టాలు రెట్టింపు అవుతున్నాయి. ఓ వైపు కాళేశ్వరం.. ఇంకోవైపు విద్యుత్ కోనుగోళ్ల అంశం..

మరోవైపు వరంగల్ టిమ్స్ నిర్మాణంపై విచారణలు జరుగుతున్నాయి. ఈ జాబితాలోకి తెలంగాణ సెక్రటేరియేట్ చేరిపోయినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు విజిలెన్స్ ఎంక్వైరీ జరుగుతున్నట్లు తెలుస్తోంది.దీనికి సంబంధించి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కొన్ని విషయాలను బయటపెట్టింది. అవినీతిని ఎంత అందంగా చేయాలో గత ప్రభుత్వాన్ని చూస్తే తెలుస్తుందని పేర్కొంది. సచివాలయం నిర్మాణం రూ.617 కోట్ల అంచనా వేసి మొదలుపెట్టింది గత కేసీఆర్ సర్కార్. నిర్మాణం పూర్తి అయ్యేనాటికి దాన్ని అమాంతంగా పెంచేసింది. రూ.617 కోట్ల నుంచి 1,140 కోట్ల రూపాయల వరకు అంచనాలు పెంచి ఖర్చు చేసినట్టు ప్రస్తావించింది.సెక్రటేరియేట్‌లో ఐటీ పరికరాల కొనుగోళ్ల కోసం తొలుత 181 కోట్ల రూపాయలు అంచనా వేసి దాన్ని 361 కోట్లకు పెంచినట్టు పేర్కొంది. అటు సచివాలయం నిర్మాణం కోసం అంచనాల కంటే ?523 కోట్లు, ఐటీ పరికరాల కొనుగోలుకు అంచనాల కంటే ?180 కోట్ల రూపాయల అధిక ఖర్చు చేసిందని ప్రస్తావించింది. ఈ భాగోతంపై విజిలెన్స్ నిగ్గు తేల్చనుంది.

అవినీతి ఎన్ని రకాలుగా అవినీతి చేయవచ్చో ఆ పార్టీకి తెలుసని తెలిపింది. వారి అవినీతి అనుభవంతో అసంబద్ధ ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై బురద జల్లుతూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించింది. బీఆర్ఎస్ అవినీతిని కప్పి పుచ్చుకునేందుకు ప్రజా ప్రభుత్వంపై అసంబద్ధ విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని దుయ్యబట్టింది. మరి విజిలెన్స్ విచారణలో ఇంకెన్ని విషయాలు బయటపడతాయో చూడాలి.

# ఆ ఐదు రాష్ట్రాలే ... దేశాభివృద్ధి కీలకం...

న్యూఢిల్లీ, ప్రపంచంలో ఐదో ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. రాబోయే ఐదేళ్లలో మూడో స్థానానికి చేరుకుంటామని అంటున్నారు ప్రధాని మోదీ. ఈమేరకు ఆయన చర్యలు కూడా చేపడుతున్నారు. అయితే దేశ ఆర్థికాభివృద్ధిలో దేశంలోని పలు రాష్ట్రాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. దేశ తలసరి ఆదాయాన్ని మించి ఆ రాష్ట్రాల తలసరి ఆదాయం ఉంది. దీంతో దేశ జీడీపీ వృద్ధిలో కూడా ఆ రాష్ట్రాలే కీలకంగా మారాయి. గతంలో దేశ ఆర్థికాభివృద్ధిలో మహారాష్ట్ర కీలకంగా ఉండేది. కానీ ఇటీవల ఆ దేశ తలసరి ఆదాయం క్రమంగా తగ్గుతోంది. దీంతో దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. దేశ జీడీపీలో 30 శాతం వాటా ఈ రాష్ట్రాలే కలిగి ఉన్నాయి. 1991 నాటి జాతీయ సగటుకన్నా ఎక్కువ. ఇక మహారాష్ట్ర వాటా 15 శాతం నుంచి 13.3 శాతానికి తగ్గింది.తలసరి ఆదాయంలో తెలంగాణ, ఢిల్లీ, హర్యాన దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయి. అత్యంత సంపన్న రాష్ట్రాలుగా నిలిచాయి. బిహార్, ఉత్తర ప్రదేశ్ అత్యల్ప జీడీపీతో చివరిస్థానంలో ఉన్నాయి. దీంతో దక్షిణాది రాష్ట్రాలే దేశ జీడీపీ వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇక ప్రాంతీయ అసమానతలు పశ్చిమ బెంగాల్ వంటి పేద రాష్ట్రాల్లో కొనసాగుతున్నాయి. కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు దక్షిణాదిలో గణనీయమైన ఆర్థిక పురోగమనాన్ని సాధించాయి.2021, సెప్టెంబర్ 25న విడుదల చేసిన ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక ప్రకారం.. జాతీయ సగటులో తలసరి ఆదాయం ఆధారంగా అత్యంత ధనిక రాష్ట్రాలుగా ఐదు రాష్ట్రాలు గుర్తింపు పొందాయి. 2014లో ఏర్పడిన తెలంగాణ అతి తక్కువ కాలంలోనే ధనిక రాష్ట్రాల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. ఢిల్లీ, హర్యానా రెండు, మూడో స్థానంలో ఉన్నాయి. మహారాష్ట్ర, భారతదేశ జీడీపీలో కీలక కంట్రిబ్యూటర్‌గా మిగిలిపోయినప్పటికీ, తలసరి ఆదాయంలో మొదటి ఐదు స్థానాల్లో స్థానం పొందలేదు.

తెలంగాణ: 176.8%
ఢిల్లీ: 167.5%
హర్యానా: 176.8%
మహారాష్ట్ర: 150.7%
ఉత్తరాఖండ్: 145.5%

తలసరి ఆదాయం ప్రకారం పేద రాష్ట్రాలు

తలసరి ఆదాయం ప్రకారం భారతదేశంలో ఉత్తరప్రదేశ్, బీహార్ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలుగా ఉన్నప్పటికీ, జాతీయ సగటులో వరుసగా 43.8% మరియు 39.2% వద్ద అత్యల్ప తలసరి ఆదాయాన్ని కలిగి ఉన్నాయి.

బీహార్: 39.2%
ఉత్తరప్రదేశ్: 43.8%
మధ్యప్రదేశ్: 46.1%
రాజస్థాన్: 51.6%
ఛత్తీస్‌గఢ్: 52.3%

ఐదు దక్షిణాది రాష్ట్రాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ మరియు తమిళనాడులు మార్చి 2024 నాటికి భారతదేశ జీడీపీలో 30% వాటాను కలిగి ఉన్నాయి, ఇది 1991లో జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. పశ్చిమ బెంగాల్, ఒకప్పుడు 1960?61లో జీడీపీలో 10.5% వాటాను కలిగి ఉంది, ప్రస్తుతం స్థిరమైన క్షీణత కేవలం 5.6%కి చేరుకుంది. దాని తలసరి ఆదాయం కూడా జాతీయ సగటులో 127.5% నుంచి 83.7%కి పడిపోయింది, ఇది రాజస్థాన్, ఒడిశా వంటి రాష్ట్రాల కంటే తక్కువ. ఉత్తరప్రదేశ్ వాటా 1960?61లో 14% నుంచి 9.5%కి పడిపోయింది. బీహార్ మూడవ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రంగా ఉన్నప్పటికీ 4.3% మాత్రమే అందించింది.

# సీబీఐకి కర్ణాటక రెడ్ సిగ్నల్..

బెంగళూరు: సీబీఐకి కర్ణాటక ప్రభుత్వం రెడ్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోకి నో ఎంట్రీ బోర్డ్ పెట్టేసింది. సడెన్‌గా ఎందుకీ డెసిషన్?? రాష్ట్రంలోని కేసుల దర్యాప్తునకు సీబీఐకి ఇచ్చిన సాధారణ అనుమతిని ఉపసంహరించుకోవాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్థల కేటాయింపు కేసులో సిద్ధరామయ్యపై ప్రత్యేక కోర్టు లోకాయుక్త పోలీసుల విచారణకు ఆదేశించిన కొన్ని గంటల తర్వాత ఈ పరిణామం జరిగింది. ఇదంతా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముడా స్కాం ఎఫెక్టేనా..? అన్న చర్చ మొదలైంది.అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్కాం కేసులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చుట్టూ ఉచ్చుబిగుస్తోంది. ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించి పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, ముఖ్యమంత్రి తన సొంతవాళ్లకు ఇష్టం వచ్చినట్లు స్థలాలు కేటాయించారంటూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. ముడా కేసును సీబీఐకి అప్పగించాలంటూ విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కర్ణాటక భూభాగంలోకి ఎంటరవ్వొద్దంటూ సీబీఐకి రెడ్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో కేసుల విచారణకు సంబంధించి సీబీఐ అనుమతిని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని కర్ణాటక న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ స్పష్టం చేశారు. సీబీఐని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందనే ఆందోళనలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్లారిటీ ఇచ్చారు.రాష్ట్రంలో సీబీఐ విచారణకు బహిరంగ సమ్మతిని ఉపసంహరించుకుంటున్నామని న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. సీబీఐ దుర్వినియోగంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐకి రిఫర్ చేసిన అన్ని కేసులలో ఇప్పటివరకు ఛార్జిషీట్లు దాఖలు చేయలేదని, చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మండిపడ్డారు. తాము పంపిన అనేక కేసులను దర్యాప్తు చేయడానికి సీబీఐ నిరాకరించిందని, ఇలాంటి ఉదంతాలు చాలానే ఉన్నాయన్నారు. సీబీఐ పక్షపాతంతో ఉన్నారని, అందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. ఇది ముడా కేసుతో సంబంధం లేదని, సీబీఐ తప్పుదారి పట్టకుండా నియంత్రించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి హెచ్‌కే పాటిల్ స్పష్టం చేశారు.సీబీఐ అనుమతి రద్దుకు ముడా స్కాంకు ఎలాంటి సంబంధం లేదంటున్నారు కర్ణాటక ప్రభుత్వ పెద్దలు. సీబీఐ పక్షపాత వైఖరితో పనిచేస్తున్నందునే.. ఈ నిర్ణయం తీసుకున్నామని చెబుతున్నారు. బీజేపీ ఏం చెబితే సీబీఐ అదే చేస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. మరో కీలక నిర్ణయానికి కర్ణాటక కేబినెట్ ఆమోదం తెలిపింది. తమ అనుమతి లేకుండా గవర్నర్ అడిగిన సమాచారాన్ని అందించకూడదని రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసింది.

# బీసీల గణన తర్వాతే ఎన్నికలు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా కులగణన చేపయాలని పట్టుబడుతున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇప్పటి వరకు ఆ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థలు ఎన్నికలు తరుముకొస్తున్న వేళ దీనిపై ప్రభుత్వం ఏం చేయబోతోందనే చర్చ అయితే నడుస్తోంది. ఇలాంటి టైంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అన్నింటిపై చాలా మందిలో ఉన్న అనుమానాలపై క్లారిటీ ఇచ్చారు. హైదరాబాద్లో జరిగిన ఓ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్కు అనుగుణంగా సమగ్ర కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై జరిగిన ఈ సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే కులగణనకు సంబంధించిన ప్రకటన వస్తుందని అన్నారు.తెలంగాణలో బీసీలకు అండగా ఉండటంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉంటుందని అన్నారు మహేష్‌గౌడ్. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే కొన్ని అమలు చేసింది. కీలకమైన కులగణనకు సంబంధించిన గైడ్‌లైన్ మూడు నాలుగు రోజుల్లో రానున్నాయని తెలిపారు. అవి పూర్తి అయిన తర్వాత బీసీలకు రావాల్సిన రిజర్వేషన్ల అంశాన్ని తేలుస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారని కూడా చెప్పేశారు.త్వరలోనే బీసీ సంఘాలను సీఎం వద్దకు తీసుకెళ్తానని మహేష్ మాట ఇచ్చారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి కావాల్సిన డిమాండ్లు, అన్నీ కూడా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్దామన్నారు. అంతే కాకుండా కుల గణన పూర్తైన తర్వాత నిజాం గ్రౌండ్స్‌లో సభ పెట్టి సీఎం రేవంత్‌ను సన్మానిద్దామని పిలుపునిచ్చారు. పార్టీ పదవుల్లో, ప్రభుత్వం పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి తీవ్రంగా శ్రమిస్తున్నారని అన్నారు. కర్ణాటకలో, బిహార్‌లో అధికారంలో ఉన్నప్పుడు కుల గణన చేసి చూపించామన్నారు. ఇప్పుడు తెలంగాణలో కూడా చేసి చూపిస్తామని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్‌లు, ఇతర సమస్యలపై ఓవైపు నుంచి కృష్ణయ్య పోరాటానికి సిద్ధమవుతున్నారు. అదే టైంలో బీఆర్ఎస్ కూడా ఒత్తిడి తీసుకొస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తోంది. బీసీ సమస్యలు పరిష్కరించి కృష్ణయ్య లాంటి వ్యక్తిని పార్టీలోకి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. బీసీలు తమవైపే ఉండేలా ప్లాన్ చేస్తోంది. అందుకే ఆయన వద్దకు రాయబారం కూడా పంపించారు. రెండు రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేసిన కృష్ణయ్యతో మల్లు రవి సమావేశమయ్యారు. పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఇటు బీఆర్ఎస్‌కి కూడా అవకాశం ఇవ్వండా ఉండేలా ప్లాన్ చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల లోపు కుల గణన పూర్తి చేసి సంపూర్ణ ఆధిపత్యం సాధించాలని కాంగ్రెస్ పార్టీ చూస్తోంది. అందుకు తగ్గట్టుగానే వచ్చే వారంలో కులగణనకు సంబంధించిన కీలక ప్రకటన చేయనుంది.

# తులం బంగారం ఎప్పుడు సారు...

హైదరాబాద్: తెలంగాణలో ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిలో కొన్ని అమలు చేసి మరికొన్ని పెండింగ్లో పెట్టింది. ఒకరకంగా చెప్పాలంటే మహిళల ఓట్లతోనే పాలనా పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్, వారికి ఎన్నికల సందర్భంలో ఓ ముఖ్యమైన హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే ఆడబిడ్డల పెండ్లికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టింది. మహాలక్ష్మి పథకం కింద రూ.లక్ష, తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2500, పింఛన్ రూ.4000 ఇస్తామని పలు సందర్భాల్లో హస్తం పార్టీ ప్రకటించింది.కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మిన ఆడబిడ్డలు ఆ పార్టీకి అధికారం కట్టబెడితే 9 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మహాలక్ష్మి పథకం హామీ అమలు దిశగా అడుగులు వేయలేదు. ఇటీవల డిసెంబర్ 7 తర్వాత మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నా. ఏ మూలనో మహిళలకు నమ్మశక్యం కావడం లేదు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు అంటే గడిచిన 10 నెలల కాలంలో వేలాది మంది ఆడబిడ్డల వివాహాలు జరిగాయి. మరి వారందరికీ లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తరా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఇటు నగదు, అటు బంగారం అంటే ఆర్థిక భారంతో కూడుకున్నది అని, అసలే బంగారం రేటు విపరీతంగా పెరుగుతున్నదని, వీటన్నిటిని భరిస్తూ కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందన్నది అనుమానమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.ఏదో మార్పు వస్తుందని.. తమకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని ఆ పార్టీని గెలిపిస్తే ఇప్పుడు మొత్తానికే హామీల ఉసేత్తడం లేదని ఆడబిడ్డలు మండిపడుతున్నారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అని చెప్పి దానినీ తూతూ మంత్రంగా అమలు చేస్తున్నారని, కేవలం ఆర్డినరీ, ఎక్స్ప్రెస్లలో తప్ప కనీసం సూపర్ లగ్జరీ బస్సుల్లో అమలు చేయడం లేదని, ఈ పథకాన్నేతూతు మంత్రంగా అమలు చేస్తున్న కాంగ్రెస్.. ఆర్థికంగా మరింత భారమయ్యే పథకాలను అమలు చేస్తుందా? అని పెదవి విరుస్తున్నారు.అసలే ఆడబిడ్డల పెళ్ళంటే ఆర్థిక భారంతో కూడుకున్న వ్యవహారం. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పడం వారిలో భరోసా నింపింది. సుమారు లక్షన్నరకు పైగా వరకు ప్రభుత్వం నుంచి వస్తాయన్న నమ్మకం కుదిరింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా మహాలక్ష్మి పథకం ఉసెత్తకపోవడం నిరుపేద తల్లిదండ్రుల్లో అసహనానికి కారణమవుతున్నది.మహాలక్ష్మి పథకంలో ఇంకో అతి ముఖ్యమైనది రూ.2500 పథకం.. దీని కేసం పేద యువతులు, గ్రుహిణులు వేయికండ్లతో ఎదురు చూస్తున్నారు. నిరుపేద కుటుంబాల్లో పుట్టిన యువతులు తమ తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం కాకూడదని, అటు గ్రుహిణులు ఈ పథకం తమ కుంటుంబానికి చేదోడువాదోడుగా ఉంటుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు, చదువుకోని వారు ఉపాధి అవకాశాలు లేక.. ఇండ్ల నుంచి బయటకు రాలేక.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

# షెల్జా చుట్టూ హర్యానా రాజకీయం

ఛండీఘడ్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి కుమారి సెల్జా దూరం పాటించడంతో రాజకీయాలు వేడెక్కాయి. సెల్జాను బుజ్జగించాల్సిన కాంగ్రెస్ హైకమాండ్ సైతం మౌనం పాటిస్తుండగా.. రాష్ట్ర అగ్రనేత, మాజీ సీఎం భూపేందర్ సింగ్ హుడా కూడా ఆమెను పూర్తిగా విస్మరించారు. ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మలచుకునేందుకు భారతీయ జనతా పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ సహా వివిధ రాజకీయ పార్టీలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. బీజేపీ నేత, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మాత్రమే కాదు, అర్జున్ రామ్ మేఘ్వాల్, బీఎస్పీ సమన్వయకర్త ఆకాష్ ఆనంద్ కాంగ్రెస్ నేత కుమారి సెల్జాతో మంతనాలు సాగిస్తున్నారు. తమ పార్టీలో చేరాలంటూ ఎవరికి వారు ఆమెకు ఆహ్వానాలు పంపుతున్నారు. సెల్జాకు ఆఫర్ల మీద ఆఫర్లు ఇస్తూ బీఎస్పీ, బీజేపీ ఎన్నికల ఎజెండాను సెట్ చేయడం ప్రారంభించాయి. దీంతో హర్యానా ఎన్నికల్లో కుమారి సెల్జా ఒక ప్రచారాంశంగా మారిపోయారు. తాజాగా బీఎస్పీ అధినేత్రి మాయావతి సైతం కుమారి సెల్జా పేరుతో దళిత నేతలను, తన వర్గం ఓటర్లను ఆకర్షించేందుకు ఎత్తుగడ వేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికల్లో ఎవరికి లాభం, ఎవరికి నష్టం జరుగుతుందన్న చర్చ జరుగుతోంది. సమాజంలో అత్యంత వెనుకబాటుతనానికి, సామాజిక వివక్షకు గురైన దళిత వర్గం ఓటర్లు దేశంలోని చాలా రాష్ట్రాల్లో నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. హర్యానాలో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో దళితుల ఓట్లు అత్యంత కీలకంగా మారాయి. కాంగ్రెస్ ఆశలన్నీ దళితుల ఓట్లపైనే ఉండగా.. లోక్‌సభలో కాంగ్రెస్‌కు లభించిన దళితుల ఓట్లను చీల్చడమే లక్ష్యంగా ప్రత్యర్థి పార్టీలు వ్యూహాలు అమలు చేస్తున్నాయి. బీజేపీ నుంచి బీఎస్పీ వరకు అందరూ కుమారి సెల్జా కోపాన్ని దళితుల ఆత్మగౌరవంతో ముడిపెడుతున్నారు. కుమారి సెల్జా దళితురాలు కాబట్టే ఆమెను కాంగ్రెస్ అవమానించిందని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నుంచి ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ, అనిల్ విజ్ వరకు బీజేపీ సీనియర్ నేతలు నిరంతరం చెబుతున్నారు. దళితులను అవమానించడమే కాంగ్రెస్ సంప్రదాయమని కుమారి సెల్జా గురించి కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అన్నారు. ఏ నాయకుడిని దూషించడాన్ని బీజేపీ సహించదని, దూషించే పదాల వాడకాన్ని అసలు ప్రోత్సహించదని అన్నారు. భూపేంద్ర సింగ్ హుడా, ఆయన మద్దతుదారులు కుమారి సెల్జాను అవమానించిన తీరును ప్రజలు ఎప్పటికీ మరచిపోరని, ఇందుకు కాంగ్రెస్ తగిన ప్రతిఫలం అనుభవించాల్సి ఉంటుందని ఉంటుందని ఆయన అన్నారు. ఇదే మాదిరిగా ఇతర బీజేపీ నేతలు కూడా మాట్లాడుతున్నారు. బీజేపీ ప్రయత్నాలు ఇలా ఉంటే.. దళిత బహుజన వర్గాల గొంతుకగా పేరున్న బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కూడా సెల్జా కోసం తమ ద్వారాలు తెరిచింది. ఆ పార్టీ సీనియర్ నేత ఆకాష్ ఆనంద్ నుంచి పార్టీ అధినేత్రి మాయావతి వరకు కుమారి సెల్జా సాకుతో దళిత వర్గాలను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కుమారి సెల్జా కోసం బీఎస్పీ తలుపులు ఎప్పటికీ తెరిచే ఉంటాయని ఆకాష్ అన్నారు. దళిత నేతలను కాంగ్రెస్ గౌరవించడం లేదని మాయావతి కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, ఇతర కులవృత్తుల పార్టీలు దళిత సంఘాల నాయకులను, ఓట్లను గడ్డు కాలంలో మాత్రమే వాడుకుని, ఆ తర్వాత విస్మరిస్తున్నాయని చెప్పేందుకు దేశంలో ఇప్పటివరకు జరుగుతున్న రాజకీయ పరిణామాలు నిదర్శనమని ఆమె వ్యాఖ్యానించారు. దళిత నాయకులు తమ దూత డాక్టర్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఇలాంటి పార్టీలకు దూరం కావాలని పిలుపునిచ్చారు. అలాగే దళిత సమాజాన్ని సైతం ఇలాంటి పార్టీలకు దూరంగా ఉంచాలని అన్నారు. సిర్సా ఎంపీ కుమారి సెల్జా హర్యానాలో కాంగ్రెస్ పార్టీకి దళిత ముఖంగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ పంపిణీలో మాజీ సీఎం హుడా క్యాంప్‌కే ప్రాధాన్యం లభించగా సెల్జా తనకు సన్నిహితంగా ఉండే 8 నుంచి 10 మంది నేతలకు మాత్రమే టిక్కెట్లు ఇప్పించగలిగారు. ఇది మాత్రమే కాదు, ఆమె తన ఓఎస్డీ డాక్టర్ అజయ్ చౌదరికి కూడా టిక్కెట్టు ఇప్పించలేకపోయారు. ఈ పరిస్థితిలో హుడా క్యాంప్ మద్దతుదారులు చేసిన వ్యాఖ్యలతో సెల్జా కోపంగా ఉన్నారు. అలాగే ఎన్నికల ప్రచారానికి సైతం దూరంగా ఉన్నారు. హర్యానా రాజకీయాల్లో జాట్ సామాజికవర్గానిదే ఆధిపత్యం. అందులోనూ కాంగ్రెస్ పార్టీలో జాట్ వర్గం నేతలే పెత్తనం చెలాయిస్తూ ఉంటారు. అందుకే 90 అసెంబ్లీ నియోజకవర్గాలున్న హర్యానాలో ముఖ్యమంత్రి రేసులో ఉన్న కుమారి సెల్జా తన వర్గానికి టికెట్లు ఇప్పించుకోలేకపోయారు. హర్యానాలో దాదాపు 21 శాతం దళిత ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలోని మొత్తం 90 సీట్లలో 17 అసెంబ్లీ స్థానాలు ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో ఉన్నాయి. అయితే వారి ప్రాబల్యం రిజర్వుడు సీట్లకు మాత్రమే పరిమితం కాలేదు. ఇంకా అనేక నియోజకవర్గాల్లో గెలుపోటములను ప్రభావితం చేసే సంఖ్యలో దళిత ఓటర్లున్నారు. కుమారి సెల్జా ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండటం వల్ల కాంగ్రెస్ అనుకూల దళిత వర్గాల్లో ఆగ్రహం, అసహనం పెరిగే అవకాశం లేకపోలేదు. రాష్ట్రంలో ఏ పార్టీనైనా మట్టికరిపించగల శక్తి దళిత ఓటర్లకు ఉంది. కుమారి సెల్జా కాంగ్రెస్ నుంచి దూరం జరిగితే, కాంగ్రెస్ ఎన్నికల వ్యూహాలన్నీ బెడిసికొట్టే ప్రమాదం ఉంది. ఎందుకంటే జాట్–దళిత సమీకరణం సహాయంతో అధికారం పొందాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇప్పుడు బీఎస్పీ నుంచి బీజేపీ వరకు అందరూ సెల్జాను ప్రచారాంశంగా మార్చడంతో పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. కుమారి సెల్జా కారణంగా ప్రభావం పంచకుల, అంబాలా, యమునా నగర్, హిసార్ మరియు సిర్సాలోని 20 అసెంబ్లీ స్థానాలపై ఉంది. సెల్జా అసంతృప్తి కారణంగా, ఈ నియోజకవర్గాల్లో పార్టీ సమీకరణాలు చెదిరిపోవచ్చు. కుమారి సెల్జా సిర్సా నుండి లోక్‌సభ ఎన్నికలలో గెలుపొందిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ కంచుకోట నియోజకవర్గాలుగా ఉన్న ఈ స్థానాల్లో పాగా వేసేందుకు బీజేపీ, బీఎస్పీలు సెల్జాను ఒక అస్త్రంగా మార్చుకోవాలని చూస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో వర్గీకరణ నిర్ణయం ద్వారా దళితుల్లో కొన్ని ఉప కులాలను తమవైపు తిప్పుకోవాలని బీజేపీ చూస్తోంది. దళితుల్లో అనేక ఉప కులాలు ఉన్నప్పటికీ, ఒకట్రెండు కులాలు మాత్రమే దళిత రిజర్వేషన్ల ఫలాలను అటు విద్య, ఉద్యోగాల్లో, ఇటు రాజకీయాల్లో బాగా ఉపయోగించుకుంటున్నాయి. మిగతా దళిత ఉపకులాలు మాత్రం తీవ్ర నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో వర్గీకరణ కారణంగా ఈ ఉపకులాలు ప్రయోజనం పొందనున్నాయి. దళితుల ప్రాబల్యం ఉన్న ఈ 15–20 స్థానాల్లో బీజేపీ గ్రాఫ్ ఏమాత్రం బాగోలేదు. ఈ పరిస్థితుల్లో సెల్జా పార్టీలో చేరితే బీజేపీ ఈ స్థానాల్లో తమ గ్రాఫ్ మెరుగుపర్చుకుని విజయం సాధించవచ్చని భావిస్తోంది. ఎన్నికలకు ముందు బీజేపీ హర్యానా ప్రభుత్వం దళితులకు 20 శాతం రిజర్వేషన్లను రెండు భాగాలుగా విభజించి పెద్ద రాజకీయ ఎత్తుగడ వేసింది. హర్యానాలోని దళిత వర్గంలో అతిపెద్ద ప్రభావం రవిదాసీ కులానిదే, దళిత సమాజంలో 50 శాతానికి పైగా ఈ కులం ప్రజలున్నారు. రవిదాసీతో పాటు వాల్మీకి తదితర దళిత సంఘాలు అధిక సంఖ్యలో ఉన్నాయి. రవిదాసీ దళితులు పూర్తిగా కాంగ్రెస్‌తో ఉన్నారు. ఇతర దళిత సంఘాలు వివిధ పార్టీల ఓటర్లుగా చీలిపోయాయి. రవిదాసి వర్గం హర్యానా రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయిస్తుంది. హర్యానాలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దళిత రిజర్వేషన్లను రెండు భాగాలుగా విభజించింది. ఇందులో రవిదాసిలకు 10% మరియు రవిదాసియేతర దళిత కులాలకు 10% రిజర్వేషన్లు కల్పించింది. రవిదాసియేతర కులాల్లో 36 కులాలున్నాయి. సెల్జా కూడా అత్యంత వెనుకబాటుకు గురైన ఈ 36 కులాల సమూహం నుంచే వచ్చారు. కుమారి సెల్జా కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటే, బీజేపీ దాని నుండి రెట్టింపు ప్రయోజనం పొందే అవకాశం ఉంది. జాట్–దళిత కాంబినేషన్ ద్వారా లబ్ది పొందాలన్న కాంగ్రెస్ వ్యూహాలను దెబ్బతీయవచ్చు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయాన్ని అందించిన దళిత ఓట్లను చీల్చి ప్రయోజనం పొందవచ్చు. మరోవైపు బాఖ కూడా తన కోర్ ఓటు బ్యాంకును తన గుప్పిట్లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. దీని కారణంగా ఆకాష్ ఆనంద్ నుండి మాయావతి వరకు అందరూ కుమారి సెల్జా వ్యవహారాన్ని రాజకీయం చేస్తున్నారు. ఇలా దళితుల ఓట్లను రాబట్టుకునేందుకు ఎవరికి వారు ఎత్తుగడలు వేస్తున్నారు. కానీఈ రాజకీయ చదరంగంలో ఎవరి ఎత్తులు ఫలించి ఎవరు ఎవరికి చెక్‌మేట్ చెబుతారు.. ఎవరు గెలుస్తారు అన్నది ఫలితాలే చెబుతాయి

# రిలయన్స్ 20 కోట్ల వరదల సాయం

హైదరాబాద్: వరదల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళం అందజేసింది. ఆ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి 20 కోట్ల చెక్కును అందజేశారు. తెలంగాణ వరదల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళం అందజేసింది. శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి రిలయన్స్ ప్రతినిధులు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బోర్డు సభ్యుడు పీఎంఎస్ ప్రసాద్, ఏపీ–తెలంగాణ రాష్ట్రాల మెంటార్ పీవీఎల్ మాధవరావులు వచ్చారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి 20 కోట్ల చెక్కును అందజేశారు. తెలంగాణలో ఇటీవల వచ్చిన వరదలు తీవ్రనష్టాన్ని మిగిల్చాయి. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలు దారుణంగా డ్యామేజ్ అయ్యాయి. వరదల దాటికి హైదరాబాద్ నుంచి వివిధ రాష్ట్రాలకు వెళ్లాల్సిన రైళ్లు సైతం నిలిచిపోయాయి. మున్నేరు వాగు పొంగడంతో చాలా ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. ఆయా ప్రాంతాలు పునరుద్ధరణకు దాతలు ముందుకొస్తున్నారు. వారిలో సినీ, రాజకీయ, బిజినెస్‌మేన్లు మేము ఉన్నామంటూ ముందుకొచ్చి తమ వంతు సాయం చేస్తున్న విషయం తెల్సిందే.

# మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

మెదక్: మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నర్సాపూర్ సమీపంలోని ఎల్లమ్మ గుడి వద్ద సంగారెడ్డి ప్రధాన రహదారి పై రోడ్డు ప్రమాదం జరిగింది. నర్సాపూర్ పట్టణానికి చెందిన రెండు ప్రైవేట్ కాలేజీ బస్సులు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు బస్సుల డ్రైవర్లతో సహా పది మంది విద్యార్థులకు తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బివిఆర్ ఐ టి కళాశాలకు చెందిన బస్సులు రెండు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక వాహనంలోని డ్రైవర్ మృతి చెందినట్టుగా తెలిసింది. ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించపోయి ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీ కొట్టినట్టుగా తెలిసింది. గాయపడిన విద్యార్థులను స్థానిక నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది..

# బస్సు ప్రమాదం ముగ్గురికి తీవ్ర గాయాలు

ఖమ్మం: ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురైంది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం సీతారామపురం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుండి సత్తుపల్లి చింతలపూడి మీదుగా చెక్కపల్లి వెళుతున్న శ్రీ కె.వి.ఆర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, నాసిక్ నుండి వైజాగ్ వెళుతున్న ఉల్లిపాయల లోడ్ లారీని ఓవర్టేక్ చేస్తూ ఉండగా, బస్సు లారీ వెనుక ఢీ కొట్టింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. అందరికీ స్వల్ప గాయాలు అయ్యాయి. ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది.

క్షతగాత్రులను చికిత్స కోసం పెనుబల్లి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కి తరలించారు. ముగ్గురు ప్రయాణికుల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# హైడ్రాను అడ్డుకుంటే ఎవరికి నష్టం...

హైదరాబాద్: నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లో అతి భారీ వర్షం కురిసింది. ఎంత అంటే.. ఎప్పుడూ నీళ్లు చూడని రోడ్లు కూడా నదుల్లా పారాయి. పదుల సంఖ్యలో జనం కొట్టుకుపోయారు. హైదరాబాద్‌లోని సగం ఇళ్లు నీట మునిగాయి. అంత వరద వందేళ్లలో రాలేదని అప్పటి ప్రభుత్వం చెప్పింది. నాలాలు కబ్జాకు గురయ్యాయని.. చెరువుల్ని కబ్జా చేశారని అన్నింటినీ క్లియర్ చేసి..మరోసారి అలాంటి పరిస్థితి రాకుండా చూస్తామని ప్రకటించారు. కానీ ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్షంలో కూల్చివేతల్ని వ్యతిరేకిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పు చేస్తోందని అంటోంది. హైడ్రా బాధితులకు అండగా ఉంటామని చెబుతోంది. అంటే కబ్జాలు చేసిన వాళ్లకు బీఆర్ఎస్ అండగా ఉంటుందా ?. ఇదే సపోర్టు ఉంటే.. మరతంగా కబ్జాలు పెరగవా ?. దీని వల్ల ఇతర ప్రజల్లో వ్యతిరేకత రాకుండా ఉంటుందా ? హైడ్రా ఇప్పటి వరకూ ఒక్కటంటే ఒక్క చోట కూడా ప్రైవేటు ల్యాండ్స్ లో కూల్చివేతలు చేపట్టలేదు. ప్లాన్ ప్రకారం కట్టలేదనో మరో కారణమో చూపి కూలగొట్టలేదు. అంటే ప్రైవేటు ఆస్తుల జోలికి వెళ్లలేదు. ఎక్కడ కూలగొట్టిన చెరువులు, ప్రభుత్వ భూముల్లో కబ్జా చేసిన కట్టిన వాటినే కూలగొట్టారు. అక్కడ కబ్జా చేసి అమ్ముకున్న వాళ్లు పరారయ్యారు. కొనుకున్న వాళ్లు నష్టపోయారు. ఈ విషయంలో ప్రభుత్వం వారికి ఏమైనా న్యాయం చేస్తుందో లేదో స్పష్టత లేదు. ఈ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించవచ్చు కానీ.. కూల్చి వేతల్ని ప్రశ్నిస్తే కబ్జాల్ని సమర్థించినట్లే అవుతుంది. దీని వల్ల బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్ లో కూడా అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హైడ్రా ఇప్పటికీ నివాసం ఉన్న ప్రాంతాలను కూలగొట్టడం లేదని.. వారికి సమయం ఇస్తామని చెబుతోంది. కొత్తగా నిర్మాణంలో ఉన్నవాటిని మాత్రం వదిలి పెట్టేది లేదని చెబుతోంది. గత పదేళ్ల కాలంలో చెరువులు, ప్రభుత్వ భూములు విపరీతంగా కబ్జా అయ్యాయి. ఇటీవల కిష్టారెడ్డిపేటలో కూల్చివేసిన ఇళ్లు ఉన్నది ప్రభుత్వ భూమే. అలా వదిలేస్తే కబ్జా దారులకు వదిలేసినట్లవుతుంది. ఆ ధైర్యంతో వారు మరిన్ని కబ్జాలు చేస్తారు. ఈ విషయంలో కిష్టారెడ్డి పేట లేకపోతే ఆ చుట్టపక్కల ప్రభుత్వానికి మద్దతే ఉంది. అవి ప్రభుత్వ భూములని తెలిసి కూడా చాలా మంది కొనుగోలు చేశారని ... మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తే తమ జోలికి రారన్నది వారి ధైర్యమని అనుకున్నారు. కానీ ప్రభుత్వం మారడంతో మొత్తం సీన్ మారిపోయింది. హైడ్రా ఎక్కడా ప్రైవేటు ఆస్తుల జోలికిరావడం లేదు కాబట్టి మెజార్టీ ప్రజలు సమర్థిస్తున్నారు. కృష్ణానది ఒడ్డున ఉన్న విజయవాడకు కృష్ణా నుంచి కాకుండా.. బుడమేరు నుంచి వచ్చిన ముప్పు వల్ల సగం విజయవాడ ప్రజలు నష్టపోయారు. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు ..న్యాయంగా ప్రైవేటు స్థలాల్లో ఇల్లు కట్టుకున్న వారికి రాకండా ఉండాలంటే ఖచ్చితంగా చెరువుల్ని.. నాలాల్ని.. కాపాడుకోవాలని అంటున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి మద్దతు లభిస్తోంది. మూసి విషయంలో నిరుపేదలకు ప్రత్యామ్నాయం చూపించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయింది కాబట్టి.. అక్కడా వ్యతిరేకత రాదని.. వచ్చినా సపోర్టే ఎక్కువ ఉంటుందని భావిస్తున్నారు

బాంబులు పెట్టి మరీ లేపేస్తున్నారు...

హైదరాబాద్‌లో హైడ్రా అక్రమ నిర్మాణదారుల గుండెల్లో బుల్డోజర్లు పరిగెత్తిస్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలో నిర్మించిన కట్టడాలను నిర్దాక్షిణ్యంగా నేల మట్టం చేస్తోంది. ఇప్పటికే హైడ్రా 100 ఎకరాల్లో నిర్మించిన వందలాది కట్టడాలనే కూల్చివేసింది. హైడ్రా దూకుడు ఇంకా కొనసాగుతోంది. హైడ్రా బుల్డోజర్లు ఎప్పుడు ఎక్కడికి వస్తాయో తెలియని పరిస్థితి. దీంతో ఆక్రమణదారుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు హైడ్రా చర్యలను రాష్ట్ర వ్యాప్తంగా స్వాగతిస్తున్నారు. అన్ని జిల్లాల్లో హైడ్రా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే.. జిల్లాలకు హైడ్రా రాక ముందే.. కొన్ని అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. వారం క్రితం మంచిర్యాల జిల్లాలో రెవెన్యూ స్థలంలో కార్మిక సంఘం నేత నిర్మించిన రూ.10 కోట్ల విలువైన భవనాన్ని నేలమట్టం చేశారు. తాజాగా సంగారెడ్డి జిల్లాలో చెరువులో నిర్మించిన భారీ భవనాన్ని అధికారులు ఏకంగా బాంబులు పెట్టి నేలమట్టం చేశారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ పంచాయతీ పరిధిలోని కుతుబ్‌శాయిపేట చెరువులో భారీ భవనం నిర్మించారు. దీనిపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు నిర్మాణం అక్రమమని నిర్ధారించారు. వెంటనే కూల్చివేతకు చర్యలు చేపట్టారు. నిర్మాణం పూర్తిగా చెరువులో ఉండడంతో పిల్లర్లకు బాంబులు అమర్చి కూల్చివేశారు.

ఈ క్రమంలో ఇద్దరు గాయపడ్డారు. సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మల్కాపూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 12 ఏళ్ల క్రితమే ఈ భవనం నిర్మించాడు. నీటిలో అడుగు పెట్టకుండా భవనంలోకి చేరుకునేలా కొంతదూరం మెట్లు కూడా కట్టాడు. ఈ బహుళ అంతస్తుల భవనం యజమాని, కుటుంబ సభ్యులు వీకెండ్‌లో ఇక్కడికి వచ్చి సేదతీరేవారు. గ్రామస్తుల ఫిర్యాదు తర్వాత అధికారులు విచారణ చేసి అక్రమ నిర్మాణం అని గుర్తించారు. యజమానికి నోటీసులు ఇవ్వడమే కాకుండా కూల్చివేతకు గడువు ఇచ్చారు. అయినా యజమాని స్పందించకపోవడంతో గురువారం(సెప్టెంబర్ 26న) బాంబులతో కూల్చివేశారు. శిథిలాలు ఎగిరిపడి గాయపడిన ఇద్దరి ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉంటే భవన కూల్చివేతపై యజమాని నరసింహులు స్పందించారు. భవన నిర్మాణానికి 12 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని తెలిపాడు. తాము పట్టా కింద అనుమతులు తీసుకుని 250 గజాల్లో భవనం నిర్మించామని పేర్కొన్నాడు. అక్రమంగా తమ భవనం కూల్చారని ఆవేదన వ్యక్తం చేశాడు. భవనం నిర్మిస్తున్న సమయంలో ఎవరూ అడ్డుకోలేదని, ఇప్పుడు కూల్చడం ఏంటని ప్రశ్నించాడు.

# అప్పులు సకాలంలో చెల్లించి సహకార అభివృద్ధికి తోడ్పడాలి



గాంధారి: గాంధారి మండల కేంద్రంలోనిగాంధారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసీసీబీ, ఐడిసిఎంఎస్ డైరెక్టర్ పెద్దబూరి సాయికుమార్ అధ్యక్షతన సహకార సంఘ ఆవరణలో మహాజన సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో చైర్మన్ మాట్లాడుతూ.. రైతులు తీసుకున్న అప్పులు సకలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. త్వరలోనే సంఘ పరిధిలో ఉన్నా నేరల్ మరియు పెట్ సంగెం గ్రామలలో గోదాం నిర్మాణ పనులు ప్రారంభం చేస్తామని అన్నారు. తర్వాత సొసైటీ కార్యదర్శి సాయిలు సొసైటీ యొక్క వార్షిక లావాదేవీలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమములో ఏఎంసి చెర్మెన్ పరమేష్,గాంధారి తాజా మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, సొసైటీ వైస్ చైర్మన్ ఉదల్ సింగ్ ,సొసైటీ డైరెక్టర్లు ధోల్లు సాయిలు, గాండ్ల లక్ష్మణ్, రొడ్డ అశోక్ రెడ్డి, ఆర్ల శివాజీ రావు, వజీర్ సవితా బాయి రావు, గొల్ల హర్జయ్య, పయ్యల జనార్ధన్, గోవింద్ గణపతిరావు, సొసైటీ కార్యదర్శి సాయిలు ,సిబ్బంది సాయిరాం,రాహుల్, నవీన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివారం మూసీలో కూల్చివేతలు

వరంగల్: హైదరాబాద్ నగరంలో మూసీ నది ప్రక్షాళన దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. తాజాగా.. మూసీ రివర్ బెడ్ ఏరియాలో ఉన్న నిర్మాణాలను అధికారులు సర్వే చేసి పరిశీలించారు. పాతబస్తీలోని ఛాదర్ ఘాట్, మూసానగర్, శంకర్ నగర్ ఏరియాల్లో కూల్చివేసే నిర్మాణాలకు మార్క్ చేశారు. దీంతో అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. గొల్కొండ ఏరియా లోని మూసీ నది పరివాహక ప్రాంతాల్లోనూ అధికారులు సర్వే నిర్వహించారు. కూల్చాల్సిన నిర్మాణాలను గుర్తించి.. మార్క్ చేశారు. మొత్తం 25 బృందాలు సర్వేలో పాల్గొన్నాయి. అతి త్వరలోనే మార్క్ చేసిన నిర్మాణాలను కూల్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే.. అక్కడ నివాసం ఉంటున్న ప్రజలను ఒప్పించి.. వారికి వేరేచోట డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చి ఖాళీ చేయించాలని అధికారులు ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. మూసీ నది వెంబడి రెవెన్యూ శాఖ నిర్వహించిన తాజా సర్వేలో.. నదీ గర్భంలో 2,116 నిర్మాణాలు, బఫర్ జోన్‌లో మరో 7,850 నిర్మాణాలు ఉన్నట్లు తేలిందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మూసీ రివర్ ఫ్రంట్ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లలో పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేస్తున్నారు. నది ఒడ్డున ఉన్న నివాసాల నుండి ఖాళీ చేసే ప్రజలకు వసతి కల్పించడానికి ప్రభుత్వం నగరంలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు 16,000 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించిందని ఆఫీసర్లు చెబుతున్నారు. మొదటి దశలో మూసీ నదీగర్భంలో ఉన్న 1,600 ఆక్రమిత ఇళ్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అక్కడి నివాసితులను తరలించనున్నారు. బఫర్ జోన్‌లో నివసిస్తున్న వారికి న్యాయమైన పరిహారం, భూసేకరణ, పునరావాసం, పునరావాస చట్టం 2013లో పారదర్శకత హక్కుకు అనుగుణంగా వారి నిర్మాణాలకు పరిహారం అందుతుంది. డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అధికారులు.. అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు బుల్డోజర్లను రివర్ ఫ్రంట్ ప్రాంతానికి తరలించడం ప్రారంభించారు. శనివారం సాయంత్రానికి అంతా సిద్ధం చేసి.. ఆదివారం కూల్చివేతలు చేపట్టే అవకాశం ఉంది. ఏకకాలంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాల రెవెన్యూ శాఖకు చెందిన బృందాలు.. మూసీ నది వెంబడి నిర్మాణాలను సర్వే చేయడం ప్రారంభించి.. అక్రమ కట్టడాల్లో నివాసముంటున్న ప్రజలను ఇంటింటికీ సర్వే చేసి ఖాళీ చేయించేలా చర్చలు జరిపారు. రివర్ ఫ్రంట్‌లోని ప్రజలను.. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తరలించిన తర్వాతే కూల్చివేత ప్రక్రియ ప్రారంభిస్తా మని అధికారులు చెబుతున్నారు. బఫర్ జోన్‌లోని ప్రజల పునరావాసం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని.. స్పష్టమైన హక్కు పత్రాలు ఉన్న వారికి 2013 చట్టం ప్రకారం తగిన పరిహారం చెల్లిస్తా మని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రదలు ఎక్కువగా వచ్చినప్పుడు జంట జలశయాలు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ గేట్లు ఓపెన్ చేసినప్పుడు కొంతమందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తుంటారు. చాదర్ ఘాట్ ప్రాంతంలో ఉండే శంకర్ నగర్, మూసారం బాగ్ లోని కొన్ని బస్తీల్లో చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇళ్లలోకి నీరు చేరుతున్న పరిస్థితి ఉంది. మూసీ నుంచి 50 మీటర్ల వరకు బఫర్ జోన్ ఉంటుంది. బఫర్ జోన్,రివర్ బెడ్ లోనూ ఉండే ఇళ్లు అన్నింటినీ తొలగించనున్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**